తెలంగాణ
TELANGANA MUCHATLU
TELTEL/2023/88710
ముచ్చట్లు
ఎడిటర్ : బొల్లెపాక రాజేష్
తెలుగు దిన పత్రిక
వరంగల్ | సోమవారం-24- నవంబర్ 2025 | సంపుటి : 3 | సంచిక : 177 | పేజీలు - 8 | వెల : రూ 5 | www.telanganamuchatlu.in


# సత్య సాయి సేవలకు తెలంగాణ సమగ్ర మద్దతు



- బాబా ఆలోచనలను ప్రజల్లో విస్తరించేందుకు సీఎం రేవంత్ హామీ
- విద్య–వైద్యం–తాగునీటి సేవలకు సాయిబాబా చేసిన కృషిని స్మరించిన సీఎం
- పుట్టపర్తి శతజయంతి వేడుకల్లో జాతీయ స్థాయి ప్రముఖుల పాల్గొనడం ప్రత్యేకత

**పుట్టపర్తి, 23 నవంబర్ (తెలంగాణ ముచ్చట్లు):**
భగవాన్ సత్య సాయిబాబా గారి ఆలోచనలు, ఆశయాలను జనజీవనంలో మరింత విస్తరించడానికి తెలంగాణ ప్రభుత్వం ఎల్లప్పుడూ సిద్ధంగా ఉంటుందని ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి ప్రకటించారు. సాయిబాబా గారి శతజయంతి ఉత్సవాలను అధికారికంగా నిర్వహించేందుకు ప్రభుత్వం ఇప్పటికే ఆదేశాలు జారీ చేసినట్లు ఆయన గుర్తుచేశారు.
పుట్టపర్తి హిల్ వ్యూ స్టేడియంలో జరిగిన శతజయంతి ఉత్సవాల్లో ఉపరాష్ట్రపతి సీపీ రాధాకృష్ణన్, త్రిపుర గవర్నర్ నల్లు ఇంద్రసేనా రెడ్డి, ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, మంత్రి నారా లోకేష్‌లతో కలిసి ముఖ్యమంత్రి పాల్గొన్నారు.

మిగతా 2లో



# హుస్నాబాద్‌లో ఇందిరా మహిళా శక్తి చీరల పంపిణీ

- మహిళా ఉన్నతి– తెలంగాణ ప్రగతి కార్యక్రమంలో పాల్గొన్న మంత్రి పొన్నం ప్రభాకర్
- మహిళలకు బొట్టు పెట్టి చీరల అందజేత
- కళ్యాణ లక్ష్మి చెక్కుల పంపిణీ

హుస్నాబాద్, 23 నవంబర్ (తెలంగాణ ముచ్చట్లు): హుస్నాబాద్ నియోజకవర్గంలోని చిగురు మామిడి మండల కేంద్రం మహాలక్ష్మి గార్డెన్స్‌లో 'మహిళా ఉన్నతి తెలంగాణ ప్రగతి' కార్యక్రమం ఘనంగా జరిగింది.

మిగతా 2లో




# తెలంగాణ మంత్రుల వాట్సాప్ గ్రూపులు హ్యాక్... సైబర్ నేరగాళ్ల కొత్త పన్నాగం

- ఎస్‌బీఐ కేవైసీ పేరుతో అపాయ ఏపీకే ఫైళ్లు షేర్
- మంత్రులు, పీఆర్వోలు, జర్నలిస్టుల ఫోన్లు టార్గెట్
- అనుమానాస్పద లింకులు ఓపెన్ చేయొద్దని సైబర్ క్రైమ్ హెచ్చరిక

**హైదరాబాద్, 23 నవంబర్ (తెలంగాణ ముచ్చట్లు):**
తెలంగాణ మంత్రులు, సీఎంవో, డిప్యూటీ సీఎం అధికారిక వాట్సాప్ గ్రూపులు సైబర్ నేరగాళ్ల టార్గెట్‌గా మారాయి. ఎస్‌బీఐ కేవైసీ అప్‌డేట్ పేరుతో ఏపీకే ఫైళ్లను గ్రూపుల్లో షేర్ చేస్తూ, వాటిని ఓపెన్ చేస్తే ఫోన్లు హ్యాకింగ్‌కు గురయ్యేలా పన్నాగం పన్నుతున్నట్లు సమాచారం.
మంత్రుల అధికారిక గ్రూపులతో పాటు పీఆర్వోలు, మీడియా గ్రూపుల్లోనూ ఇదే విధంగా ఏపీకే ఫైళ్లు పంపబడుతున్నాయి. జర్నలిస్టుల ఫోన్లు కూడా ప్రభావితమయ్యాయనే వార్తలు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి.

మిగతా 2లో






# భారత్–దక్షిణాఫ్రికా భాగస్వామ్యం మరింత బలపాటు

- జోహన్నెస్‌బర్గ్‌లో ప్రధాని–రామఫోసా భేటీ
- వాణిజ్యం, సంస్కృతి, పెట్టుబడులపై విస్తృత చర్చలు
- సాంకేతికత–కృత్రిమ మేధస్సు రంగాల్లో సహకారం విస్తరణ

**జోహన్నెస్‌బర్గ్, 23 నవంబర్ (తెలంగాణ ముచ్చట్లు):**
జి20 సమ్మిట్‌లో భాగంగా భారత ప్రధాని మరియు దక్షిణాఫ్రికా అధ్యక్షుడు సిరిల్ రామఫోసా మధ్య కీలక సమావేశం జరిగింది. రెండు దేశాల మధ్య కొనసాగుతున్న వ్యూహాత్మక భాగస్వామ్యాన్ని మరింత బలపర్చే దిశగా విస్తృత చర్చలు జరిపారు. ద్వైపాక్షిక సంబంధాలలో నూతన అవకాశాలపై కూడా ఇద్దరు నేతలు అభిప్రాయాలు పంచుకున్నారు.

మిగతా 2లో

# టిమ్స్ ఆసుపత్రులపై హరీశ్‌రావు ఫైర్

- "డేట్లు, డెడ్‌లైన్లు మార్చడం తప్ప ఏం చేస్తున్నారు?" — సీఎం రేవంత్‌పై విమర్శలు
- పనుల్లో జాప్యం ప్రభుత్వ పరమైన వైఫల్యమని ఆరోపణ
- పేదలకు వైద్యసేవలు అందించడంలో నిర్లక్ష్యం కనిపిస్తోంది అని వ్యాఖ్య

**హైదరాబాద్, 23 నవంబర్ (తెలంగాణ ముచ్చట్లు):**
సనత్‌నగర్ టిమ్స్ ఆసుపత్రిని నెలరోజుల్లో ప్రారంభిస్తామని అక్టోబర్ 23న ప్రభుత్వం ప్రకటించి, ఇప్పటికీ లోటుపాట్లు మార్చలేదని మాజీ మంత్రి హరీశ్‌రావు మండిపడ్డారు. నెల గడిచినా ఆసుపత్రి ప్రారంభం పై స్పష్టత లేకపోవడాన్ని ఆయన ఎద్దేవా చేశారు.

మిగతా 2లో



# చేనేత కార్మికుల సమస్యల పరిష్కారానికి ప్రభుత్వమే అండగా నిలవాలి: కవిత

- వనపర్తి కొత్తకోటలో జాగృతి 'జనం బాట'
- చేనేత కార్మికుల దుర్భర పరిస్థితిపై ఆందోళన
- పద్మశాలీలకు ప్రాధాన్యం, బీసీలకు రాజ్యాంగ రిజర్వేషన్లపై డిమాండ్



**హైదరాబాద్, 23 నవంబర్ (తెలంగాణ ముచ్చట్లు):**
వనపర్తి జిల్లా కొత్తకోటలో చేనేత కార్మికులను కలిసి వారి సమస్యలను ప్రత్యక్షంగా అడిగి తెలుసుకున్న జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత, చేనేత రంగం ప్రస్తుతం ఎదుర్కొంటున్న తీవ్ర సమస్యలను ప్రభుత్వ దృష్టికి తీసుకువచ్చారు.

మిగతా 2లో


తెలంగాణ ముచ్చట్లు TELANGANA MUCHATLU
ఎడిటర్ : బొల్లెపాక రాజేష్
తెలుగు దిన పత్రిక




# సత్య సాయి సేవలకు తెలంగాణ సమగ్ర మద్దతు

(మొదటి పేజీ తరువాయి)

ఈ సందర్భంగా బాబా చూపిన సేవా మార్గం, మానవతా దృక్పథం దేశానికే మార్గదర్శకమని ఆయన పేర్కొన్నారు.
"సాయిబాబా గారు మనుషుల్లో దేవుడిని చూశారు. ప్రేమతో గెలిచారు. సేవలతో దేవుడిగా కొలువబడ్డారు" అని పేర్కొన్న సీఎం, కేజీ నుంచి పీజీ వరకు ఉచిత విద్య అందించి పేదల భవిష్యత్తు మార్చిన సేవలను ప్రత్యేకంగా గుర్తుచేశారు. వైద్య సేవలు, తాగునీటి సదుపాయాల కల్పనలో బాబా చేసిన కృషి ప్రభుత్వాలు చేయలేని స్థాయిలో ఉందని అన్నారు. తెలంగాణ పాలమూరు,



ఆంధ్రములోని అనంతపురం, తమిళనాడులో కూడా బాబా సేవలు ప్రజల జీవితాల్లో వెలుగులు నింపాయని వివరించారు.
140 దేశాల్లో బాబా భక్తులు సేవా కార్యక్రమాలు కొనసాగించడం ఆయన ప్రభావాన్ని, మానవతా స్ఫూర్తిని ప్రతిబింబిస్తోందని ముఖ్యమంత్రి అన్నారు. శతజయంతి ఉత్సవాలకు దేశాధ్యక్షులు, కేంద్ర-రాష్ట్ర మంత్రులు, పలువురు దేశాల ప్రతినిధులు హాజరుకావడం బాబా యొక్క మహత్తును మరోసారి తెలియజేస్తుందని వ్యాఖ్యానించారు.
కార్యక్రమం అనంతరం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సాయి కుల్వంత్ హాలులోని సత్య సాయిబాబా మహాసమాధిని దర్శించుకున్నారు. సత్య సాయిబాబా ఆలోచనలను ప్రజలకు చేరవేయడంలో ప్రభుత్వం అన్ని విధాలా సహకరిస్తుందని సీఎం స్పష్టం చేశారు.

# టిమ్స్ ఆసుపత్రులపై హరీశ్‌రావు ఫైర్

(మొదటి పేజీ తరువాయి)



"ఈరోజే ప్రారంభమా? లేక మళ్లీ మరో కొత్త తేదీ ప్రకటించబోతున్నారా?" అని ప్రభుత్వం వైఖరిపై ప్రశ్నలు లేవనెత్తారు.
టిమ్స్ ఆసుపత్రుల నిర్మాణాల్లో రెండేళ్లుగా డేట్లు, డెడ్‌లైన్లు మాత్రమే మార్చుతున్నారని, వాస్తవ పురోగతి లేదని హరీశ్‌రావు విమర్శించారు. ప్రభుత్వ భూములను రక్షించడంపై ఉన్న శ్రద్ధ, పేదలకు వైద్యం అందించే ఆసుపత్రులపై లేదని ఆయన తెలిపారు. జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల ప్రచారంలో గప్పాలు కొట్టడం తప్ప, రేవంత్ ప్రభుత్వం ఆసుపత్రుల పనుల్లో ఏ మాత్రం ముందడుగు వేయలేదని ఆయన వ్యాఖ్యానించారు.
సనత్‌నగర్, ఆల్వాల్, ఎల్బీనగర్ టిమ్స్ ఆసుపత్రుల పనుల్లో జరుగుతున్న నత్తనడక ప్రభుత్వ అసమర్ధతను చూపుతోందని హరీశ్‌రావు అన్నారు. "మాటలు కోటలు దాటినా, పనులు ఆచరణలోకి రావడం లేదని చెప్పడానికి పూర్తికాని ఆసుపత్రులే నిదర్శనం" అని పేర్కొన్నారు. కమీషన్ల కోసం ఉద్దేశపూర్వకంగా పనులను ఆపేయడం ప్రజలపై 'క్రిమినల్ నెగ్లిజెన్స్' అని ధ్వజమెత్తారు.
టిమ్స్ ఆసుపత్రుల రూపకల్పనను కేసీఆర్ కరోనా తరువాత వందేళ్ల ముందుచూపుతో చేసినట్లు గుర్తుచేసిన హరీశ్‌రావు, బీఆర్ఎస్ అధికారంలో ఉండగా ఈ నిర్మాణాలు శరవేగంగా జరిగాయని చెప్పారు. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక పనులు నిలిచిపోయాయంటూ ఆరోపించారు. కేసీఆర్‌కు క్రెడిట్ వెళ్లిపోతుందనే కురచబుద్ధితో రేవంత్ రెడ్డి పనులను ఉద్దేశపూర్వకంగా ఆలస్యం చేస్తున్నారని ఆయన అభిప్రాయపడ్డారు.
కొత్తపేట టిమ్స్ ఆసుపత్రి సందర్శన తర్వాత కూడా ఒకడుగు ముందుకు పడకపోవడం ప్రభుత్వ వైఖరిని చూపిస్తోందని హరీశ్‌రావు అన్నారు. వేగంగా పనులు ప్రారంభిస్తామని మంత్రి హామీ ఇచ్చినా, ఆ మాటలకు విలువ లేకుండా పోయిందని వ్యాఖ్యానించారు.
పేదలకు ఉత్తమ వైద్యసేవలు అందించాలనే లక్ష్యంతో కేసీఆర్ ప్రారంభించిన టిమ్స్ ఆసుపత్రులను యుద్ధప్రాతిపదికన పూర్తి చేసి ప్రజల సేవలోకి తీసుకురావాలని హరీశ్‌రావు డిమాండ్ చేశారు.

# తెలంగాణ మంత్రుల వాట్సాప్ గ్రూపులు హ్యాక్... సైబర్ నేరగాళ్ల కొత్త పన్నాగం

(మొదటి పేజీ తరువాయి)

గ్రూపుల్లోకి ఏపీ ఫైళ్లు ప్రవేశించడం ఆందోళన కలిగించే విషయం అని అధికారులు భావిస్తున్నారు.
ఈ ఘటన వెలుగులోకి రాగానే తెలంగాణ సైబర్ క్రైమ్ పోలీసులు అప్రమత్తమయ్యారు. ఏ విధమైన ఏపీకే ఫైళ్లు వచ్చినా ఎట్టి పరిస్థితుల్లోనూ ఓపెన్ చేయొద్దని స్పష్టం చేశారు. అనుమానాస్పద లింకులు, కేవైసీ అప్‌డేట్ పేరుతో వచ్చే మెసేజ్‌లు క్లిక్ చేస్తే డేటా దొంగిలింపు ప్రమాదం ఉందని హెచ్చరించారు. ఇటువంటి సైబర్ మోసాల నుంచి జాగ్రత్తగా ఉండాలని ప్రజలకు, అధికారులకు సూచించారు.
ఈ వ్యవహారంపై మరిన్ని వివరాలు సేకరిస్తున్నట్లు పోలీసులు తెలిపారు.






## భారత్–దక్షిణాఫ్రికా భాగస్వామ్యం మరింత బలపాటు

(మొదటి పేజీ తరువాయి)

భారత్-దక్షిణాఫ్రికా సంబంధాలు వాణిజ్యం, పెట్టుబడులు, సంస్కృతి రంగాల్లో ఇప్పటికే బలంగా కొనసాగుతున్నాయి. ఈ సమావేశంలో ఈ రంగాలను మరింత విస్తరించేందుకు ప్రాధాన్యత ఇచ్చారు. రెండు దేశాల మధ్య ప్రజల అనుబంధాన్ని పెంచేందుకు సంస్కృతిక మార్పిడి కార్యక్రమాలను అమలు చేయాలని నిర్ణయం తీసుకున్నట్టు సమాచారం.
సాంకేతికత, నైపుణ్యాభివృద్ధి, కృత్రిమ మేధస్సు, కీలక ఖనిజాలు వంటి కొత్త రంగాల్లో సహకారం పెంచుకోవడానికి అవకాశం ఉందని భారత ప్రధాని స్పష్టం చేశారు. ఈ రంగాల్లో సంయుక్త కార్యక్రమాలు చేపట్టడం ద్వారా రెండు దేశాల ఆర్థిక సాంకేతిక సామర్థ్యం మరింత బలోపేతం అవుతుందని వ్యాఖ్యానించారు. దక్షిణాఫ్రికా జి20 అధ్యక్షతను విజయవంతంగా నిర్వహించినందుకు ప్రధాని రామఫోసాను అభినందించారు. ప్రపంచ స్థాయి నేతృత్వంతో సమావేశాన్ని ముందుకు నడిపిన దక్షిణాఫ్రికా ప్రయత్నాలను భారత్ ప్రశంసించింది. దీంతో రెండు దేశాల మధ్య విశ్వాసం మరింత పెరిగినట్లు ప్రభుత్వ వర్గాలు పేర్కొన్నాయి.

# హుస్నాబాద్‌లో ఇందిరా మహిళా శక్తి చీరల పంపిణీ

(మొదటి పేజీ తరువాయి)

ఈ సందర్భంగా ఇందిరా మహిళా శక్తి చీరలు మహిళలకు మంత్రి పొన్నం ప్రభాకర్ అందజేశారు. ముఖ్య అతిథిగా నాయకులు హాజరైన మహిళలకు బొట్టు పెట్టి సారే (చీరలు) పంపిణీ చేశారు.
కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో మహిళలు పాల్గొని ప్రభుత్వ పథకాల పట్ల తమ సంతోషాన్ని వ్యక్తం చేశారు. మహిళల ఆర్థిక సామాజిక శక్తివర్ధకానికి ప్రభుత్వం చేపడుతున్న కార్యక్రమాలను ఈ సందర్భంగా నిర్వాహకులు వివరించారు. చీరల పంపిణీతో పాటు మహిళా సంక్షేమానికి ఉద్దేశించిన మరిన్ని చర్యలను అధికారుల బృందం సూచించింది.
చీరల పంపిణీ అనంతరం కళ్యాణ లక్ష్మి పథకం కింద అర్హులైన లబ్ధిదారులకు చెక్కులను అందజేశారు. ఆర్థిక పరమైన భారం





తగ్గించడంలో ఈ పథకం కీలక పాత్ర పోషిస్తోందని అధికారులు పేర్కొన్నారు. పేద కుటుంబాలపై పెళ్లిళ్ల సమయంలో వచ్చే ఖర్చులను తగ్గించేందుకు ఈ పథకం మరింత ఉపయోగకరమని తెలిపారు.
కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి, అదనపు కలెక్టర్ అశ్వినీ తానాజీ వకడే, హుస్నాబాద్ మార్కెట్ కమిటీ చైర్మన్ తిరుపతి రెడ్డి తో పాటు పలువురు నాయకులు, అధికారులు పాల్గొన్నారు. మహిళల సంక్షేమానికి మరింత చర్యలు తీసుకుంటామని వారు పేర్కొన్నారు.

# శంకర సముద్రం రిజర్వాయర్ నిర్వాసితుల సమస్యలపై కవిత ఆరా

- **వనపర్తి కొత్తకోట–కానాయిపల్లి ప్రాంతంలో జాగృతి పర్యటన**
- **నిర్వాసితుల జీవన పరిస్థితులపై ప్రత్యక్ష సమాచారం సేకరణ**
- **ప్రభుత్వం తక్షణ చర్యలు తీసుకోవాలని డిమాండ్**

**కొత్తకోట, 23 నవంబర్ (మొదటి పేజీ తరువాయి):** వనపర్తి జిల్లా కొత్తకోట-కానాయిపల్లి పరిధిలోని శంకర సముద్రం రిజర్వాయర్‌ను తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత సందర్శించారు. రిజర్వాయర్ నిర్మాణంతో ప్రభావితమైన నిర్వాసితులను ప్రత్యక్షంగా కలిసిన ఆమె, వారి సమస్యలను వివరంగా అడిగి తెలుసుకున్నారు.
రిజర్వాయర్ కారణంగా ఇళ్లు, భూములు కోల్పోయిన ప్రజల బాధలను విన్న కవిత, పునరావాసం, పరిహారం, జీవనోపాధి వంటి అంశాల్లో ఉన్న లోపాలను అధికారుల దృష్టికి తీసుకువెళ్లాలని హామీ ఇచ్చారు. పునరావాస కాలనీల్లో మౌలిక సదుపాయాల కొరత, తాగునీటి సమస్యలు, పంట భూముల కోల్పోవడం వల్ల వచ్చిన ఇబ్బందులను ప్రజలు ఆమెకు వివరించారు.
ఈ సందర్భంగా కవిత మాట్లాడుతూ, ప్రాజెక్ట్‌ల వల్ల ప్రభావితులైన ప్రజలకు ప్రభుత్వం సరైన రీతిలో అండగా నిలవాల్సిన అవసరం ఉందన్నారు. నిర్వాసితుల సమస్యలను అధికారులు శీఘ్ర పరిష్కరించాల్సిన బాధ్యత ఉందని, జాగృతి తరఫున వారికి పూర్తి మద్దతు అందిస్తామని తెలిపారు.
శంకర సముద్రం రిజర్వాయర్ పర్యటనలో స్థానిక ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని, తమ సమస్యలు, ఆశలు-ఆకాంక్షలను కవితకు తెలియజేశారు.






# చేనేత కార్మికుల సమస్యల పరిష్కారానికి ప్రభుత్వమే అండగా నిలవాలి: కవిత

(మొదటి పేజీ తరువాయి)

చేనేతే నాగరికతకు ప్రతీకైనా, దానిని నేసే కార్మికులు దయనీయ జీవితాలు గడుపుతున్నారనే విషయాన్ని ఆమె ఆవేదనగా ప్రస్తావించారు.
తెలంగాణ రాష్ట్ర ఏర్పాటుకు ముందు నుంచే దేశవ్యాప్తంగా చేనేత కార్మికులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నా, రాష్ట్ర ఏర్పాటుకు తర్వాత కేసీఆర్ ప్రభుత్వం పెన్షన్, నూలుకు సబ్సిడీ అందించడంతో కొంత ఊరట లభించిందని కవిత గుర్తుచేశారు. అయితే ప్రస్తుత ప్రభుత్వ కాలంలో సబ్సిడీలు నిలిచిపోవడం వల్ల కార్మికులు మరింత కష్టాల్లోకి నెట్టబడుతున్నారని ఆమె అన్నారు. చేనేత కుటుంబంలో ఒక్కరికి చేనేత పెన్షన్ వచ్చినా, సాధారణ పెన్షన్ కూడా ఇవ్వాలని డిమాండ్ చేశారు.
చీరలు నేసినా, సొంతంగా వ్యాపారం చేయలేక కూలీ పనులపై ఆధారపడే పరిస్థితి ఏర్పడిందని కవిత పేర్కొన్నారు. పెండింగ్‌లో ఉన్న సబ్సిడీలను విడుదల చేసి, లోన్లు అందజేస్తేనే చేనేత రంగానికి కొంత ప్రోత్సాహం లభిస్తుందని సూచించారు. కొత్త తరం ఈ కళను



అభివృద్ధి చేయాలంటే ప్రభుత్వ అండ తప్పనిసరిగా అవసరమని, లేనిపక్షంలో చేనేత కళ అంతరించే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. పద్మశాలీల జనాభా పెద్దది అయినప్పటికీ ఏ ప్రధాన రాజకీయ పార్టీ వారిని నిర్ణాయక పదవుల్లోకి తీసుకురాలేదని ఆమె విమర్శించారు. అన్నిరాజకీయ పార్టీలూ వారికి ప్రాధాన్యం ఇవ్వాలని, అదే విధంగా బీసీ వర్గాలకు పార్టీల ఆధారంగా కాకుండా రాజ్యాంగ పరంగా రిజర్వేషన్లు కల్పించాలని కవిత డిమాండ్ చేశారు. అప్పుడు మాత్రమే వర్గాల తరఫున సమస్యలు ప్రభుత్వ స్థాయిలో ధైర్యంగా చెప్పగలరని అభిప్రాయపడ్డారు.
కొత్తకోట చేనేత కళాకారుల కష్టాన్ని ప్రత్యక్షంగా చూసినట్లు కవిత చెప్పారు. బట్ట నేయడంలో వారు పడుతున్న శ్రమ అపారమని, వారిని ఆదుకోవడం ప్రభుత్వ బాధ్యత అని పేర్కొన్నారు. జాగృతి తరఫున కూడా వీలైనంత సహాయం అందిస్తామని ఆమె హామీ ఇచ్చారు.



## నూతన వధూవరులను ఆశీర్వదించిన ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్ రెడ్డి

**జనగామ, నవంబర్ 23 (తెలంగాణ ముచ్చట్లు):** జనగామలోని భ్రమరాంబ కన్వెన్షన్ హాల్‌లో జరిగిన వివాహ వేడుకకు జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్ రెడ్డి హాజరయ్యారు. నర్మెట మండలం మచ్చుపహాడ్ గ్రామానికి చెందిన పెద్ది రాజిరెడ్డి–రజిత దంపతుల కుమారుడు శ్రీకర్ రెడ్డి, డాక్టర్ ఇమ్మడి ప్రత్యూష రెడ్డి వివాహ వేడుకలో పాల్గొని నూతన వధూవరులను ఎమ్మెల్యే ఆశీర్వదించారు. వారికి శుభాకాంక్షలు తెలుపుతూ,.. అక్కడున్నవారితో కాసేపు పల్లా సంభాషించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు మరియు స్థానికులు పాల్గొన్నారు.





## కార్యకర్తకు అండగా నిలిచిన ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్ రెడ్డి

**ధర్మసాగర్,నవంబర్ 23 (తెలంగాణ ముచ్చట్లు):** స్టేషన్ ఘనపూర్ నియోజకవర్గ పరిధిలోని,ధర్మసాగర్ మండలం తాటికాయల గ్రామానికి చెందిన బీఆర్ఎస్ పార్టీ గ్రామ శాఖా ప్రధాన కార్యదర్శి బొల్లెపాక సంపత్ ఇటీవల బైక్ ప్రమాదంలో గాయపడ్డారు.ఇట్టి విషయం తెలుసుకున్న జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్ రెడ్డి తాటికాయల గ్రామానికి చేరుకుని సంపత్‌ను పరామర్శించారు. అనంతరం కుటుంబ సభ్యులతో మాట్లాడి ఆరోగ్య పరిస్థితులను పూర్తిగా తెలుసుకున్నారు. ప్రమాదంతో ఇబ్బందులు పడుతున్న సంపత్‌కు అండగా తక్షణ సహాయంగా పది వేల రూపాయలు అందించిన పల్లా రాజేశ్వర్ రెడ్డి, అవసరమైతే భవిష్యత్‌లో కూడా అన్ని రకాల సహకారాన్ని అందిస్తానని కుటుంబానికి హామీ ఇచ్చారు. కార్యకర్తలకు అండగా కుటుంబ సభ్యుల్లా తోడుగా నిలబడే తన మానవీయతను మరోసారి చాటిన ఎమ్మెల్యే పల్లా చర్య గ్రామస్థులలో విశేషమైన ప్రశంసలు పొందింది. ఆయన వెంట స్థానిక బిఆర్ఎస్ నాయకులు ,తదితరులు పాల్గొన్నారు.



## కానిస్టేబుల్ కుటుంబానికి సిపిఎం నాయకులు పరామర్శ

- సిపిఎం పార్టీ మండల కార్యదర్శి, ఎస్ నవీన్ రెడ్డి
- సిపిఎం పార్టీ మండల నాయకులు బానోతు నాగేశ్వరరావు

**ఖమ్మం బ్యూరో, నవంబర్ 23, తెలంగాణ ముచ్చట్లు;** కామేపల్లి మండలంలోని భాషిత్ నగర్ గ్రామ పంచాయతీకి చెందిన ఎస్ బి కానిస్టేబుల్ ఇటీవల మృతి చెందిన ధరావతు బాలాజీ నాయక్ ( 33 )సంఘటన తెలుసుకొని రఘునాథపాలెం మండల సిపిఎం పార్టీ మండల కార్యదర్శి, ఎస్ నవీన్ రెడ్డి, సిపిఎం పార్టీ మండల నాయకులు, బానోతు నాగేశ్వరరావు, వారి స్వగృహం కు వెళ్లి ఆదివారం నిర్వహించిన దిశ దినకర్మలో వారి చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులు అర్పించారు.వారి కుటుంబానికి ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు.. ఈ కార్యక్రమంలో గిరిజన సంఘం మండల అధ్యక్షులు, గుగలోతు కుమార్, సిపిఎం పార్టీ పుటాని తండా గ్రామ శాఖ కార్యదర్శి గుగులోతు హరి తదితరులు పాల్గొన్నారు.

## ఆరోగ్యం ప్రజలందరి హక్కుగా గుర్తుంచుకోవాలి



- పల్లెప్రపంచం ఫౌండేషన్ అధ్యక్షులు పల్లా కొండలరావు
- లాభం కోసం ఉత్పత్తిలో అనివార్యంగా కల్తీ ఆహారం
- సామ్యవాద వ్యవస్థ ద్వారానే అందరికీ ఆరోగ్యం సాధ్యం

**ఖమ్మం బ్యూరో, నవంబర్ 23, తెలంగాణ ముచ్చట్లు;** ఆరోగ్యం ప్రజలందరి హక్కుగా గుర్తుంచుకోవాలని పల్లెప్రపంచం ఫౌండేషన్ అధ్యక్షులు పల్లా కొండలరావు తెలిపారు. మండల కేంద్రమైన బోనకల్ సిపిఎం కార్యాలయంలో ఆదివారం అందరికీ ఆరోగ్యం అసాధ్యమా? అనే అంశంపై స్టడీ సర్కిల్ నిర్వహించారు. కన్వీనర్ తెల్లాకుల శ్రీనివాసరావు అధ్యక్షత వహించారు. పల్లా కొండలరావు మాట్లాడుతూ లాభం కోసం ఉత్పత్తి చేసే వ్యవస్థలో ఆహారం కల్తీ అవ్వక తప్పని పరిస్థితుల్లోకి నెట్టి వేయబడుతున్నామన్నారు. గ్రామాల్లో గేదెల సంఖ్యకు పాల వాడకం లెక్కకు పొంతన ఉందా? అని ప్రశ్నించారు. దీనిని గురించి ఆలోచించకుంటే రానున్న రోజుల్లో భారత దేశంలో ప్రతి ఇంట్లో ఓ కేన్సర్ పేషెంట్ ఉంటారని నిపుణులు చెబుతున్న గణాంకాలు ఆందోళన కలిగిస్తోందన్నారు. గాలి, నీరు, ఆహారం అన్నీ కాలుష్యంతో కూడుకోవడం వల్ల ప్రజల ఆరోగ్యం ప్రమాదంలో పడిందన్నారు. శారీరక,మానసిక, సామాజిక ఆరోగ్యం కలిగి ఉంటేనే మనిషి సంపూర్ణంగా ఆరోగ్యంగా ఉన్నట్లు గుర్తించాలని ప్రపంచ ఆరోగ్య సంస్థ 1948లో నిర్వహించిందని నేటికీ భారత్ లో ప్రజలకు ఆరోగ్యం పట్ల సరైన అవగాహన లేకపోవడం దురదృష్టం అన్నారు. ఆరోగ్యమే మహాభాగ్యం అని పెద్దలు చెప్పిన సత్యం మరచి పోయామన్నారు. మహా భాగ్యంతో ఆరోగ్యం వస్తుందనుకుని డబ్బు సంపాదన కోసం టెన్షన్ పెంచుకుని మానసిక ఒత్తిడి పెంచుకుని కొత్త రోగాలు కొని తెచ్చుకుంటున్నారన్నారు. 30 ఏండ్లకే సర్వ రోగాలు వస్తున్నాయన్నారు. ఆసుపత్రుల సంఖ్య పెరగడం అంటే అనాగరికత పెరగడమేనన్న మహాత్మా గాంధీ చెప్పారని నేటి సమాజంలో ఆసుపత్రుల సంఖ్య, స్పెషలిస్టుల సంఖ్యతో పాటు రోగుల సంఖ్య పెరుగుతోందన్నారు. అవసరం లేకపోయినా టెస్టులు, మందులు, ఆపరేషన్లు చేయడం పరిపాటి అయిపోయిందన్నారు. డాక్టర్లు పెట్టుబడిదారులు చెప్పిన టార్గెట్ల కోసం ఈ పని చేయడం దారుణమన్నారు. విద్య,వైద్యం, ఫార్మసీ లు మూడు పూర్తిగా ప్రభుత్వ రంగంలో మాత్రమే ఉంటే తప్ప పరిస్థితి మారదన్నారు. ఉత్పత్తి వ్యవస్థ పూర్తిగా ప్రభుత్వ రంగంలో ఉన్నప్పుడు మాత్రమే కల్తీ ఆహారం ఆగిపోతుందన్నారు. అందరికీ ఆరోగ్యం సాధ్యం కావాలంటే వ్యవస్థలో మార్పు కోసం సమిష్టిగా పోరాటం చేయాలన్నారు. వ్యక్తిగత అలవాట్లు సరిగా ఉంచుకోవడం ద్వారా, పౌష్టికాహారంపై, శరీర నిర్మాణంపై అవగాహన పెంచుకోవడం ద్వారా ఈ వ్యవస్థలో ఆరోగ్యంగా జీవించేలా చైతన్యం పెంచుకోవాలన్నారు. ఈరోజుల్లో కూడా చుక్కా రామయ్య, కేరళ సిపిఎం నేత అచ్యుతానందన్, బ్రిటన్ మహిళ ఎథెల్ కాటర్ హామ్ లతో పాటు గ్రామాల్లో కూడా వందేళ్ళకు పైగా జీవిస్తుండడం గమనంలో ఉంచుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా నాయకులు చింతలచెరువు కోటేశ్వరరావు, ఐద్వా మధిర డివిజన్ అధ్యక్షురాలు జొన్నలగడ్డ సునీత, వ్యవసాయ కార్మిక సంఘం మధిర డివిజన్ అధ్యక్షులు బంధం శ్రీనివాసరావు,సిపిఎం మండల కార్యదర్శి కిలారు సురేష్, సిఐటియు మండల కన్వీనర్ గుగులోతు నరేష్ , బూర్గుల అప్పాచారి,చలమల హరికిషన్ రావు, పి.వి.అప్పారావు, కుక్కల కోటేశ్వరరావు,యనమద్ది శ్రీనివాసరావు, రామారావు, ఏసుపోగు బాబు, ఉప్పర శ్రీను, జర్నలిస్ట్ షరీఫ్ , జి.ప్రశాంతి, షేక్ సిలార్, మిరియాల వెంకటకృష్ణ తదితరులు పాల్గొన్నారు.



## పుట్టినరోజున ప్రేమ బహుమతులు చేతి గడియారం అమ్మకు, హెల్మెట్ నాన్నకు

**ఉప్పల్, నవంబర్ 23 (తెలంగాణ ముచ్చట్లు):** తల్లిదండ్రులపై ప్రేమతో పాటు, భద్రతపై ఉన్న అవగాహనను చాటుకుంటూ చిన్నారి ఇడపాక సిశిరా తన పుట్టినరోజును ప్రత్యేకంగా మార్చుకుంది. శనివారం జరిగిన జన్మదినోత్సవ సందర్భంగా సిశిరా, తన తల్లి కోసం చేతి గడియారం, తండ్రి కోసం హెల్మెట్‌ను స్వయంగా దాచుకున్న పొదుపు డబ్బులతో కొనుగోలు చేసి బహుమతిగా అందించింది. తండ్రి రక్షణ కోసం కొనిచ్చిన ఈ హెల్మెట్‌ను ప్రేమగా అందించడం కుటుంబ సభ్యులు, బంధువులను హర్షింపజేసింది. చిన్న వయసులోనే బాధ్యతాయుతమైన ఆలోచన ప్రదర్శించిన సిశిరాను ఆమె తల్లిదండ్రులు ఇడపాక సునీత, సురేష్ అభినందించారు.సిశిరా పుట్టినరోజు సందర్భంగా బంధువులు, స్నేహితులు, శ్రేయోభిలాషులు హృదయపూర్వక శుభాకాంక్షలు తెలియజేశారు.





## జర్నలిస్టు సమస్యలపై ఐక్యంగా పోరాడుదాం

- టి డబ్ల్యూ జె ఎఫ్ జిల్లా అధ్యక్షులు పల్లా కొండలరావు
- బోనకల్ ప్రెస్ క్లబ్ లో టి. డబ్ల్యూ. జె. ఎఫ్ సభ్యత్వ నమోదు కార్యక్రమం ప్రారంభం

**ఖమ్మం బ్యూరో, నవంబర్ 23, తెలంగాణ ముచ్చట్లు;**జర్నలిస్టు సమస్యలపై ఐక్యంగా పోరాడుదామని, ప్రతి జర్నలిస్టుకి టీ డబ్ల్యూ జె ఎఫ్ అండగా ఉంటుందని యూనియన్ జిల్లా అధ్యక్షులు పల్లా కొండలరావు తెలిపారు. ఆదివారం మండల కేంద్రంలోని ప్రెస్ క్లబ్ కార్యాలయంలో సంఘం సభ్యత్వ నమోదు కార్యక్రమం ప్రారంభించారు.10 మంది జర్నలిస్టులకు యూనియన్ సభ్యత్వాన్ని అందజేశారు. ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు దేగల వేలాద్రి అధ్యక్షతన జరిగిన సభలో మిగతా జర్నలిస్టులకు కూడా స్థానిక నాయకులు సభ్యత్వం అందించాలని పల్లా కొండలరావు కోరారు. ఎన్నో సంవత్సరాల నుండి జర్నలిస్టులుగా పనిచేస్తున్న వారికి ఇళ్ల స్థలాలు, హెల్త్ కార్డులు, అక్రిడేషన్ కార్డులు, ఇవ్వకుండా ప్రభుత్వం తాత్సారం చేస్తుందని, జర్నలిస్టుల సమస్యల పరిష్కారంలో యూనియన్ జర్నలిస్టులకు అండగా ఉంటుందని అన్నారు. సభ్యత్వ నమోదు కార్యక్రమం మధిర నియోజకవర్గంలో అన్ని మండలాల్లో చేపట్టనున్నట్టు ఆయన తెలిపారు. జర్నలిస్టులందరూ తమ వృత్తి నైపుణ్యాలను మెరుగుపరచుకోవాలని, ప్రజలు ప్రభుత్వానికి మధ్య వారధిగా ఉంటూ ప్రజాక్షేత్రంలో సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో యూనియన్ జిల్లా కోశాధికారి తేనె వెంకటేశ్వర్లు, ప్రెస్ క్లబ్ గౌరవ సలహాదారు యంగల అమరయ్య, ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు దేగల వేలాద్రి, ఉపాధ్యక్షుడు మంద సత్యానందం, కార్యదర్శి యంగల గౌతం, వర్కింగ్ ప్రెసిడెంట్ ఎస్ కే బడే,సభ్యులు బాజీ షరీఫ్, కొణతాలపల్లి నాగేశ్వరరావు, తగరం రమేష్,ఎస్.కె మదార్ సాహెబ్ తదితరులు పాల్గొన్నారు.

## సత్యసాయి జీవితం... స్ఫూర్తిదాయకం..

**15వ బెటాలియన్ దళాధిపతి పెదబాబు**



**సత్తుపల్లి, నవంబర్ 23 (తెలంగాణ ముచ్చట్లు):** సత్తుపల్లి మండలం, గంగారంలో గల 15వ బెటాలియన్ ఆవరణలో ఆదివారం సత్యసాయిబాబా 100వ శత వర్ష దినోత్సవ వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా సత్యసాయి చిత్రపటానికి బెటాలియన్ దళాధిపతి పెదబాబు పుష్పాంజలి ఘటించారు. ఆయన మాట్లాడుతూ, సత్యసాయిబాబా ఆధ్యాత్మిక బోధనలు, మానవత విలువలు, సేవా కార్యక్రమాలు మన అందరికీ మార్గదర్శకం అని తెలిపారు. అనేకమందికి సేవలందించిన బాబా స్ఫూర్తితో సమాజ అభివృద్ధిలో భాగస్వాములు కావాలని ఆకాంక్షించారు. ఆయన బోధనల స్ఫూర్తితో ప్రేమ మార్గంలో పయనించాలని పేర్కొన్నారు.
మానవసేవే మాధవసేవ అని భావిస్తూ ప్రేమ, కరుణ, సేవ, సత్యం, ధర్మం, శాంతి, అహింస వంటి మానవ విలువలను ఆచరిస్తూ అందరికీ ఆదర్శంగా నిలిచారని అన్నారు. అనేకమందికి ఆయన ఆరాధ్య దైవం కావడం విశేషమని కొనియాడారు. కార్యక్రమంలో సహాయ దళాధిపతి పి. వేణుగోపాల్ రెడ్డి, అర్ఐలు, ఆర్ఎస్ఐలు, ఇతర అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## బాపట్ల బీచ్‌కు ఖమ్మం ఆర్టీసీ సేవలు

**ఖమ్మం బ్యూరో, నవంబర్ 23, తెలంగాణ ముచ్చట్లు:** ఖమ్మం ప్రజల ఆకాంక్ష మేరకు తెలంగాణ రాష్ట్ర రోడ్డు సంస్థ ఖమ్మం డిపో నుండి డీలక్స్ సర్వీసును బాపట్లలోని సూర్యలంక బీచ్ నకు ప్రత్యేక బస్సును ఖమ్మం బస్ స్టేషన్ నుండి నవంబర్ 30 ఆదివారం ఉదయం ఆరు గంటలకు బయలుదేరి సూర్యలంక బీచ్ కు చేరుకోనును, మళ్లీ సాయంత్రం 6 గంటలకు బీచ్ వద్ద నుండి బయలుదేరి ఖమ్మంలో దింపబడును. ఇట్టి ప్రయాణానికి పెద్దలకు 1000/ రూపాయలుగా పిల్లలకు 530/రూపాయలుగా పూర్తి ట్రిప్పు తీసుకెళ్లి తీసుకొచ్చే విధంగా ఖమ్మం డిపో మేనేజర్ శివప్రసాద్ ఒక ప్రకటనలో తెలియజేశారు. ఇట్టి అవకాశాన్ని ఖమ్మంలో ఉన్న ప్రజలందరూ వినియోగించుకోవాలని తెలియజేశారు. ఇట్టి వివరాలకు 9136446666 ఫోన్ నెంబర్ ను సంప్రదించాలని తెలియజేయడం జరిగింది.

తెలంగాణ ముచ్చట్లు TELANGANA MUCHATLU
ఎడిటర్ : బొల్లెపాక రాజేష్
తెలుగు దిన పత్రిక



## నాగలక్ష్మి నగర్ ఫేజ్–2 కాలనీ కార్యవర్గ కమిటీ ప్రకటించారు

**మల్లాపూర్, నవంబర్ 23 (తెలంగాణ ముచ్చట్లు):** ఉప్పల్ నియోజకవర్గం, కాప్రా సర్కిల్ మల్లాపూర్ డివిజన్ లోనా గలక్ష్మి నగర్ ఫేజ్-2 కాలనీకి కొత్తగా ఏర్పాటైన కార్యవర్గ కమిటీని సభ్యులు ఆదివారం అధికారికంగా ప్రకటించారు. కాలనీ అభివృద్ధి, శాంతి భద్రతలు, నీటి-డ్రైనేజీ సమస్యల పరిష్కారం, పారిశుద్ధ్యంపై ప్రత్యేక దృష్టితో కమిటీ కార్యాచరణ కొనసాగుతుందని సభ్యులు తెలిపారు.ఈ సందర్భంగా ఎన్నికైన నూతన కమిటీ సభ్యులు వివరాలు ఇలా ఉన్నాయి:అధ్యక్షులు: కోయిల కొండ రాజేష్ ,ప్రధాన కార్యదర్శి: చెరుకు నాగరాజ్ ,వైస్ ప్రెసిడెంట్లు: వేణు గౌడ్,శ్రీశైలం గౌడ్,శ్రీనివాస్ గౌడ్.కోశాధికారి: యు. శేఖర్ గౌడ్. ముఖ్య సలహాదారులు:దూసరి శ్రీనివాస్ గౌడ్, కప్పర సురేష్ గౌడ్, బర్మ చంద్ర శేఖర్, బాలరాజ్ గౌడ్. సలహాదారులు :వాసు, ఖమ్రుద్దీన్, చోకట్ రవీందర్, బర్మ అంజి, ఈ గున్న.జాయింట్ సెక్రటరీ: ఈ కరణ్.అసిస్టెంట్ సెక్రటరీ: బి. సురేష్ (చిన్న).కాలనీ అభివృద్ధి కార్యక్రమాలను సమిష్టిగా ముందుకు తీసుకెళ్లి, నివాసులకు మెరుగైన సౌకర్యాలు అందించేందుకు కట్టుబడి పనిచేస్తామని కమిటీ సభ్యులు తెలిపారు.



## ఎం.వెంకటాయపాలెంలో కాంగ్రెస్‌కు కొత్త ఊపు

◆ తుంబూరు దయాకర్ రెడ్డి ఆధ్వర్యంలో 50 కుటుంబాల చేరిక

**ఖమ్మం బ్యూరో, నవంబర్ 23, తెలంగాణ ముచ్చట్లు;** పాలేరు నియోజకవర్గం ఖమ్మం రూరల్ మండలం ఎం. వెంకటాయపాలెం గ్రామంలో ఆదివారం జరిగిన కార్యక్రమంలో పలు పార్టీలకు చెందిన 50 కుటుంబాలు కాంగ్రెస్ పార్టీ కండువా కప్పుకున్నారు. తెలంగాణ రెవెన్యూ, గృహ నిర్మాణం, సమాచార శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి క్యాంప్ ఆఫీస్ ఇంచార్జ్ తంబూరు దయాకర్ రెడ్డి ఆధ్వర్యంలో ఈ చేరికలు జరిగాయి. చేరిక సభలో మద్దులపల్లి మార్కెట్ కమిటీ చైర్మన్ బైరు హరినాథ్ బాబు, రూరల్ మండల అధ్యక్షుడు కళ్లెం వెంకటరెడ్డి, అజ్మీర అశోక్ నాయక్, కందుకూరి వెంకట్ నారాయణ, తిప్పిరెడ్డి రాజశేఖర్ రెడ్డి, నాగమణి, బేతంపూడి రాయుడు, నాగండ్ల ఉపేందర్, కొమ్ము వెంకన్న, కొమ్ము నాగయ్య, వడ్లమూడి భాస్కర్, మద్దెల నాగయ్య, బేతంపూడి మధు, రామగిరి సత్యం, పడియాల వెంకట్ నారాయణ, జంపయ్య, రాజు, సుందర్ రావుతో పాటు స్థానిక నాయకులు, కార్యకర్తల పాల్గొన్నారు.



## మేడ్చల్ జిల్లా కాంగ్రెస్ నూతన అధ్యక్షుడు వజ్రేష్ యాదవ్‌ను కలిసిన పరమేశ్వర్ రెడ్డి

**మేడ్చల్, నవంబర్ 23 (తెలంగాణ ముచ్చట్లు):** మేడ్చల్-మల్కాజ్గిరి జిల్లా కాంగ్రెస్ పార్టీ నూతన అధ్యక్షులుగా వజ్రేష్ యాదవ్ నియమితులైన సందర్భంగా, ఉప్పల్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి మండముల పరమేశ్వర్ రెడ్డి ఆదివారం మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు.ఈ సందర్భంగా పరమేశ్వర్ రెడ్డి మాట్లాడుతూ జిల్లా కాంగ్రెస్ పార్టీని బలోపేతం చేసే దిశగా వజ్రేష్ యాదవ్ నాయకత్వానికి తమ పూర్తి మద్దతు ఉంటుందని పేర్కొన్నారు. పార్టీ విస్తరణ, కార్యకర్తల ఐక్యత, ప్రజా సమస్యల పరిష్కారం వంటి అంశాల్లో కలిసి పనిచేయడానికి సిద్ధంగా ఉన్నామని తెలిపారు.ఈ కార్యక్రమంలో నాచారం, మల్లాపూర్, రామంతాపూర్, హబ్సిగూడ, చిలకనగర్ డివిజన్ అధ్యక్షులు రఫిక్, కాప్రా సాయి గౌడ్, బండారి శ్రీకాంత్ గౌడ్, రాజేష్ ముదిరాజ్, విజయ్ కుమార్, వాళ్లపు శ్రీకాంత్ యాదవ్, ఉప్పల్ నియోజకవర్గ యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు ఆకారపు అరుణ్, కంది శ్రవణ్ రెడ్డి, పేట మురళి ముదిరాజ్, బాబు రావు, రాజన్న, నయీం, షాగా శ్రీధర్, అజ్జీద్, గౌతమ్, మాలు నాయక్ కిషోర్ తదితరులు పాల్గొన్నారు.






## డా. ఆర్.ఎస్. ప్రవీణ్ కుమార్ జన్మదిన 3కె రన్‌లో పాల్గొన్న కార్పొరేటర్ ప్రభుదాస్

**కాప్రా, నవంబర్ 23 (తెలంగాణ ముచ్చట్లు):** డా. ఆర్.ఎస్. ప్రవీణ్ కుమార్ జన్మ దినాన్ని పురస్కరించుకుని ప్రతిజ్ఞ దివాస్ కార్యక్రమంలో భాగంగా రాజీవ్ నగర్ స్వేరోస్ టీమ్ ఆధ్వర్యంలో నిర్వహించిన 3కె రన్‌లో మీర్పేట్ హౌసింగ్ బోర్డు డివిజన్ కార్పొరేటర్ జెర్రిపోతుల ప్రభుదాస్ పాల్గొన్నారు. రాజీవ్ నగర్ నుండి ఇందిరా నగర్ కమాన్ వరకు నిర్వహించిన ఈ రన్‌లో ప్రభుదాస్ స్వయంగా పరుగులో పాల్గొని యువతకు ప్రేరణ కలిగించారు.ఆయన అనంతరం కేక్ కటింగ్ చేసి ప్రవీణ్ కుమార్ పుట్టినరోజును సెలబ్రేట్ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, గురుకుల పాఠశాలల అభివృద్ధికి ప్రవీణ్ కుమార్ చేసిన కృషి అపారమని, బడుగు-బలహీన-బహుజన వర్గాల కోసం ఆయన చేసిన సేవలు చిరస్మరణీయమని పేర్కొన్నారు.స్థానిక యువత, పిల్లలు, పెద్దలు చిన్నా పెద్దా తేడా లేకుండా ఈ 3కె రన్‌లో ఉత్సాహంగా పాల్గొన్నారు. కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ గొల్లూరి అంజయ్య, కాంగ్రెస్ డివిజన్ అధ్యక్షులు పోలేపాక అంజయ్య, డాక్టర్ శ్రీనివాస్ నాయక్, మేడ్చల్ జిల్లా రాజీవ్ నగర్ స్వేరోస్ టీమ్ సభ్యులు, ఆర్.ఎస్. ప్రవీణ్ కుమార్ అభిమానులు, కాలనీవాసులు తదితరులు పాల్గొన్నారు.





## ఐ అండ్ పిఆర్ మాజీ డైరెక్టర్ రాజమౌళిని పరామర్శించిన జనగాం ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్ రెడ్డి

**ధర్మసాగర్,నవంబర్23 (తెలంగాణ ముచ్చట్లు):** తెలంగాణ రాష్ట్ర సమాచార,పౌర సంబంధాల శాఖ మాజీ (సంచాలకులు) డైరెక్టర్ బలభద్ర రాజమౌళి తల్లి బలభద్ర వెంకటమ్మ ఇటీవల మృతిచెందగా ఆదివారం జనగాం ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్ రెడ్డి స్టేషన్ ఘనపూర్ నియోజకవర్గం తాటికాయల గ్రామంలోని రాజమౌళి నివాసానికి వెళ్లి వారి కుటుంబ సభ్యులను పరామర్శించారు.అనంతరం వెంకటమ్మ చిత్రపటానికి నివాళులు అర్పించారు.ఈ కార్యక్రమంలో వారి కుటుంబ సభ్యులు బలభద్ర రవి,వెంకటేశ్వర్లు,బిఆర్ఎస్ నాయకులు గుడివెనుక దేవేందర్,మామిడి రవీందర్,
ననుబాల చంద్రమౌళి, వల్లాల నర్సయ్య, ఎర్ర ప్రభాకర్, దుబాల రాజయ్య,ఎర్ర అశోక్,అనంతపురం కమలేష్, గోవిందు సురేష్, బొల్లెపాక రమేష్, పట్ల రమేష్ తదితరులు పాల్గొన్నారు.

**బిక్షపతిని పరామర్శించిన ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్ రెడ్డి**

ఇదే (తాటికాయల)గ్రామానికి చెందిన పోలీస్ డిపార్ట్మెంట్ లో పనిచేస్తున్న పెసరు బిక్షపతి తల్లి పెసరు వజ్రమ్మ ఇటీవలే మరణించగా ఆదివారం జనగాం ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్ రెడ్డి, బిక్షపతిని వారి నివాసంలో కలిసి పరామర్శించారు. అనంతరం పెసరు వజ్రమ్మ చిత్రపటానికి పూలు వేసి నివాళులు అర్పించారు. ఆయన వెంట స్థానిక బిఆర్ఎస్ నాయకులూ ఉన్నారు.





## రాష్ట్ర స్థాయి బాస్కెట్ బాల్ పోటీల ఎంపికలకు స్పందన

**ఖమ్మం బ్యూరో, నవంబర్ 23, తెలంగాణ ముచ్చట్లు;** ఆదివారం నగరం లోని గ్రేటర్ పెవిలియన్ గ్రౌండ్ ఇండోర్ బాస్కెట్ బాల్ స్టేడియంలో రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికలు ఘనంగా జరిగాయి. ఈ ఎంపికల ప్రక్రియ లో ముఖ్య అతిథులుగా జిల్లా యువజన కాంగ్రెస్ నాయకులు తుమ్మల యుగంధర్, నాగళ్ళ దీపక్ చౌదరి లు విచ్చేసి క్రీడాకారులను పరిచయం చేసుకొని బాస్కెట్ వేసి ఎంపికలను ప్రారంభించారు, ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఇక్కడ జరిగే జిల్లా జట్టు ఎంపికలో సత్తా చాటిన క్రీడాకారులు త్వరలో సంగారెడ్డి జిల్లా లో జరిగే రాష్ట్ర స్థాయి సీనియర్ బాస్కెట్ బాల్ ఛాంపియన్షిప్ పోటీలలో జిల్లా జట్టు సత్తా చాటి జాతీయ జట్టులో స్థానం పొంది జిల్లా పేరు ప్రఖ్యాతలను జాతీయ స్థాయిలో వినపడింప చేయాలని ఆయన అన్నారు. ఖమ్మం నగర కాంగ్రెస్ అధ్యశులు దీపక్ చౌదరి మాట్లాడుతూ పెద్ద పెద్ద పట్నాలకే పరిమితం అయిన బాస్కెట్ బాల్ స్టేడియలు ఖమ్మం లో ఉండటం గర్వించదగ్గ విషయమని క్రీడాకారులు నిత్యం సాధన చేయాలని అన్నారు.
ఇదే సందర్భం పురస్కరించుకుని కొత్తగా ఎంపిక అయిన నగర అధ్యశులు దీపక్ చౌదరి నీ బాస్కెట్ బాల్ క్రీడా ప్రతినిధులు ఎం వి రమణ యాదవ్, రమేష్, ఆదినారాయణ లు ఘనంగా సన్మానించారు, ఈ కార్యక్రమంలో లో కార్పొరేటర్ లు పాలేపు విజయలక్ష్మీ వెంకటరమణ లు, దుద్దుకూరి వెంకటేశ్వర్లు నాయకులు జగదీష్, లక్మణ్ లు మరియు బాస్కెట్ బాల్ ఖమ్మం జిల్లా సెక్రెటరీ ఏం. చంద్రకాంత్, ట్రెస్యూరర్ అనూప్ సీనియర్ క్రీడాకారులు భారతచంద్ర పాల్గొన్నారు.

## జె డి సారయ్య ను వెంటనే అరెస్ట్ చేయాలి






**ఖమ్మం బ్యూరో, నవంబర్ 23, తెలంగాణ ముచ్చట్లు;** అర్చకులను పురోహితులను కించపరస్తు ప్రజావేదికల పేరుతొ భారత నాస్తిక సమాజం ఆధ్వర్యంలో జె డి సారయ్య అతని బృందం పురోహితులను, అర్చకులను బ్రాహ్మణ లను కించపరుస్తూ పాటలు పాడాడాన్ని దూప దీప నీవేదన అర్చక సంఘము ఖమ్మం జిల్లా త్రీవ్రంగా ఖండించింది ఈ సందర్భంగా జిల్లా నుంచి రాష్ట్రా సంఘం ప్రధాన కార్యదర్శి గా ఉన్న అన్న వజ్జల ప్రసాద్ శర్మ మాట్లాడుతూ ప్రజలలో కులాల పట్ల వ్యతిరేకత పెంచేవిధంగా భారతీయ సనాతన సంప్రదాయలను కించపరిచేవిధంగా పాటలు పాడటం అర్చక పురోహిత నిర్వహించే వారిని కించపరచడం మేనని సమాజం ఎన్నో తరాల నుండి కుల వృత్తులను ఆధారం చేసుకొని సమరష్యంగా జీవనాన్ని సాగిస్తున్నారని జె డి సారయ్య చేష్టలు సమాజ హితనకీ చేటు అని ఇలాంటి వారిని ఉపేక్షించకూడదని అన్నారు ఖమ్మం జిల్లా అధ్యక్షులు మునగలేటి రమేష్ శర్మ ప్రధాన కార్యదర్శి మరింగంటి భార్గవా చార్యులు బలగం శివప్రసాద్ శర్మ అమంచి సురేష్ శర్మ మరియు అర్చకులు జె డి సారయ్య వెంటనే అరస్ట్ చేయాలి అని ఖమ్మం మూడవ పట్టణ పోలీస్ స్టేషన్ నందు పిర్యాదు చేసినారు ఖమ్మం జిల్లా డి డి యన్ అర్చక సంఘం తరుపున కార్యవర్గ సభ్యులు కె చంద్రశేఖర్ శర్మ ఎన్ ఉదయ్ శర్మ యస్. సీతారామయ్య శర్మ బి ఉమేష్ శర్మ మరియు అర్చకులు పాల్గొన్నారు



## ఆదర్శ పొరుగు వారితో ఆదర్శ సమాజం సాధ్యం

**రౌండ్ టేబుల్ సమావేశం లో మహిళా వక్తల సందేశం జమాఅతె ఇస్లామీ హింద్**

**ఖమ్మం బ్యూరో, నవంబర్ 23, తెలంగాణ ముచ్చట్లు;** దేశవ్యాప్తంగా నవంబర్ 2130 వరకు నైబర్స్ రైట్స్ క్యాంపెయిన్ (పొరుగు వారి హక్కులు) ప్రచార ఉద్యమంలో భాగంగా ఆదివారం స్థానిక కార్యాలయంలో రాష్ట్ర మహిళా కార్యదర్శి ఇష్రత్ బాను అధ్యక్షతన మహిళా మేధావులు రౌండ్ టేబుల్ సమావేశం లో ముఖ్యఅతిథిగా పాల్గొన్న డిప్యూటీ మేయర్ ఫాతిమా జుహార మాట్లాడుతూ పొరుగున ఉన్న బంధువులు, అపరిచితులైన పొరుగువారు, పక్కనున్న మిత్రులు, బాటసారులు, మీ అధీనంలో ఉన్న జనం పట్ల ఉదారబుద్ధితో వ్యవహరించాలన్నారు మరొక ముఖ్య అతిథిగా పాల్గొన్న ఐఎంఏ అధ్యక్షురాలు డాక్టర్ రెహనా మాట్లాడుతూ సత్సమాజ నిర్మాణం కావాలంటే, శాంతియుత , సమైఖ్య జీవనం కొరకు ప్రతి ఒక్కరు సత్ ప్రవర్తన , పొరుగు వారిపట్ల సత్ సంబంధాలు కలిగి ఉండాలి అని కోరారు డిజిటల్ ప్రపంచంలో ఇతరుల భావాలను గౌరవిస్తూ పిల్లలకు పొరుగువారి హక్కులను బోధించడం, వారికి తినుబండారాలు, ఆట వస్తువుల విషయంలో పక్కవారిని కూడా భాగస్వాములను చేయాలని అన్నారు. చివరిగా ఇష్రత్ బాను మాట్లాడుతూ సమాజంలో సఖ్యత, సత్సంబంధాలు, మానవతా విలువలను పెంపొందించేందుకు జమాతే ఇస్లామి హింద్ దేశవ్యాప్తంగా పది రోజుల పాటు 'ఆదర్శ పొరుగు – ఆదర్శ సమాజం' పేరుతో ప్రత్యేక ఉద్యమాన్ని ప్రారంభించింది. మన చుట్టూ ఉన్న వారితో మంచితనంతో వ్యవహరించడం, అదే నిజమైన దైవభక్తి, వేగవంతమైన పట్టణ జీవితం, అపార్ట్‌మెంట్ సంస్కృతి వంటి పరిణామాల వల్ల, ఒకప్పుడు కుటుంబంలా ఉన్న పొరుగువారితో సంబంధాలు మెల్లగా కోల్పోయాయని అన్నారు ఈ ఉద్యమం పొరుగు వారి మధ్య నైతిక విలువలు మానవ బంధాలు బలపడేందుకు తోడ్పడుతుందని అన్నారు విశిష్ట అతిథులుగా పాల్గొన్న అమ్మ ఆశ్రమం ప్రెసిడెంట్ వి మంజుల పిరమిడ్ సేవాదళ్ కురపాటి శ్రీలత, మెడికల్ ఆఫీసర్స డాక్టర్ అర్షిద, డాక్టర్ రెహనా సుల్తానా, డాక్టర్ యాస్మిన్, డాక్టర్ అస్మా , డాక్టర్ నౌషిన్, డాక్టర్ కమలా కోఆర్డినేటర్ డిస్ట్రిక్ట్ హబ్ ఫర్ ఎంపవర్మెంట్ ఆఫ్ ఉమెన్ సమీన్ , ఉమెన్స్ కానిస్టేబుల్ సోనీ, సూపర్వైజర్ షకీరా బేగం, అకౌంటెంట్ డిఆర్డిఏ ముజీబున్నిసా , యస్ మీనా నూర్జహాన్ బేగం, ఆబిదా సల్మా, సంధ్యారాణి , అర్శియ ఫిర్దోస్, వింధ్య చారని పొరుగు వారి హక్కులు పై తన అమూల్య సందేశాన్ని ఇచ్చారు ఈ కార్యక్రమంలో జమాతే ఇస్లామి హింద్ జిల్లా మహిళా అధ్యక్షురాలు అస్మా అన్జుమ్, సెంట్రల్ అధ్యక్షురాలు అస్ఫియ అన్జుమ్, నార్త్ అధ్యక్షురాలు హుస్నేన్ బి ,సౌత్ అధ్యక్షురాలు నాజియా తబస్సుం ,వెస్ట్ అధ్యక్షురాలు ఫర్జానా మరియు మహిళా విద్యావంతులు పాల్గొన్నారు

## దశదిన కర్మకు హాజరైన బిఆర్ఎస్ నాయకులు



**ఖమ్మం బ్యూరో, నవంబర్ 23, తెలంగాణ ముచ్చట్లు;** నాగులవంచలో ఇటీవల మరణించిన చింతకాని మండల బి ఆర్ ఎస్ నాయకులు వంకాయలపాటి సత్యనారాయణ తల్లి వంకాయలపాటి సుగుణమ్మ పెద్ద కర్మ సందర్భంగా చిత్రపటానికి మంకెన రమేష్, వంకాయలపాటి మమత ( జిహెచ్ఎంసి డైరెక్టర్), లచ్చయ్య, రామక్రిష్ణ (యు ఎస్ ఏ), అంబటి సైదేశ్వరావు, కొమ్మినేని వెంకటేశ్వర్లు, గుడిపూడి జోగిభాబా, చింతనిప్పు వెంకటేశ్వర్లు, ప్రసాద్, నెల్లూరి రమేష్, మంకెన వెంకటేశ్వర్లు, పాము యేసు, మద్దినేని వెంకటేశ్వర్లు పూలమాలలు వేసి నివాళులర్పించారు.

# మహిళల ఆర్థిక బలోపేతమే ప్రభుత్వ లక్ష్యం: కలెక్టర్ అనుదీప్





- పాలేరు నియోజకవర్గంలో ఇందిరమ్మ చీరల పంపిణీ ప్రారంభం
- 18 ఏళ్లు నిండిన ప్రతి మహిళకు చీర

**ఖమ్మం బ్యూరో, నవంబర్ 23, తెలంగాణ ముచ్చట్లు;** మహిళలు ఆర్థికంగా బలపడితేనే కుటుంబాల ప్రగతి సాధ్యమవుతుందని జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి అన్నారు. పాలేరు నియోజకవర్గంలోని నాలుగు మండలాల మహిళల కోసం సత్యనారాయణపురం బైపాస్ రోడ్డులోని టీసీవీ రెడ్డి ఫంక్షన్ హాల్‌లో ఆదివారం జరిగిన ఇందిరమ్మ చీరల పంపిణీ కార్యక్రమంలో పాల్గొన్నారు. మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి క్యాంప్ కార్యాలయ ఇన్‌చార్జ్ తుంబూరు దయాకర్ రెడ్డితో కలిసి మహిళలకు చీరలు అందజేశారు.

**గ్రామీణ ప్రాంతాల్లోనే మొదటి విడత**

కలెక్టర్ అనుదీప్ మాట్లాడుతూ.... 18 ఏళ్లు పూర్తి చేసిన ప్రతి మహిళకు చీర అందేలా ప్రభుత్వం భారీ స్థాయిలో పంపిణీ కార్యక్రమం చేపట్టిందని తెలిపారు. గ్రామాలలో అర్హులైన మహిళలందరికీ చీరలు అందజేయడంలో ఎలాంటి లోటుపాట్లకు తావు ఇవ్వొద్దని అధికారులకు సూచించారు. చీరలను ఇంటింటికీ వెళ్లి అందించాలి అని స్పష్టం చేశారు.

**మహిళా సంఘాల కోసం కొత్త వ్యాపార అవకాశాలు**

మహిళల పురోగతికి ప్రభుత్వం పలు ఆర్థిక అవకాశాలను కల్పిస్తోందని కలెక్టర్ వివరించారు. పెట్రోల్ బంకులు, సోలార్ పవర్ ప్లాంట్లు, ఆర్టీసీ అద్దె బస్సులు, ఇందిరమ్మ క్యాంటీన్లు వంటి రంగాల్లో మహిళా సంఘాలకు అవకాశాలు అందజేస్తున్నామని తెలిపారు. "మహిళల చేతిలో డబ్బు ఉంటే కుటుంబాల వ్యవస్థ బలపడుతుంది" అని అన్నారు. పాలేరు నియోజకవర్గంలోని నాలుగు మండలాల్లో మొత్తం 53 వేల అర్హులైన మహిళలకు చీరల పంపిణీ సజావుగా జరగేలా చర్యలు చేపట్టాలని కలెక్టర్ ఆదేశించారు.

**కోటిమంది మహిళలకు కోటి చీరలు : దయాకర్ రెడ్డి**

తుంబూరు దయాకర్ రెడ్డి మాట్లాడుతూ.... స్వర్గీయ ఇందిరాగాంధీ జయంతి సందర్భంగా రాష్ట్రవ్యాప్తంగా కోటిమంది మహిళలకు కోటి చీరలు పంపిణీ చేయడం ప్రభుత్వ లక్ష్యమని తెలిపారు. ఇందిరా మహిళా శక్తి పథకం ద్వారా మహిళలను ఆర్థికంగా స్థిరపడేలా ప్రభుత్వం కట్టుబడి ఉందని చెప్పారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సహకారంతో మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి నాయకత్వంలో పాలేరు నియోజకవర్గంలో పెద్ద ఎత్తున సంక్షేమ-అభివృద్ధి కార్యక్రమాలు వేగంగా సాగుతున్నాయని వివరించారు. "ఒక అన్న తన చెల్లికి ఇచ్చే కానుకలా ప్రభుత్వం మహిళలకు చీరలు అందిస్తోంది" అని అన్నారు. ఈ కార్యక్రమంలో డిఆర్డిఓ సన్యాసయ్య, ఆత్మ కమిటీ చైర్మన్ చావా శివరామకృష్ణ, మార్కెట్ కమిటీ చైర్మన్ హరినాథ్ బాబు, తహసీల్దార్లు రాంప్రసాద్, విల్సన్, వెంకటేశ్వర్లు, ప్రజాప్రతినిధులు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

## వేంసూరులో రిపోర్టర్ కుటుంబాన్ని పరామర్శించిన.! మంత్రి తుమ్మల

**సత్తుపల్లి, నవంబర్ 23(తెలంగాణ ముచ్చట్లు):** వేంసూరు మండలంలో రిపోర్టర్‌గా పనిచేస్తున్న మూర్తి సతీమణి ఇటీవల కన్నుమూసిన నేపథ్యంలో, మంత్రి తుమ్మల నాగేశ్వర రావు మూర్తి నివాసానికి వెళ్లి కుటుంబ సభ్యులను పరామర్శించారు. స్వర్గీయ కర్లపూడి హైమావతి చిత్రపటానికి పూలమాలలు సమర్పించి నివాళులు అర్పించారు.

ఈ క్రమంలో మండల కాంగ్రెస్ నాయకులు, తుమ్మల అభిమానులు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.



# 5 లక్షల పెట్టుబడి..

## 2030కి బంగారం విలువ ఎక్కడికి చేరుతుందంటే?

బంగారం ధరలు గత కొన్ని సంవత్సరాలుగా ఎడతెగకుండా పెరుగుతూనే ఉన్నాయి. ప్రపంచవ్యాప్తంగా ఆర్థిక అనిశ్చితి, ద్రవ్యోల్బణం, జియోపాలిటికల్ టెన్షన్లు పెరగడంతో పెట్టుబడిదారులు మళ్లీ సేఫ్ అసెట్‌గా బంగారం వైపు పరుగులు పెడుతున్నారు. ఇదే క్రమంలో ఇప్పుడు చాలా మంది అడుగుతున్న ప్రశ్న ఒక్కటే... ఈరోజు రూ.5 లక్షల విలువైన బంగారం కొనుగోలు చేస్తే 2030 నాటికి దాని విలువ ఎంత అవుతుంది?




ప్రస్తుతం దేశంలో 24 క్యారెట్ల బంగారం ధర 10 గ్రాములకు సుమారు రూ.1,25,990 వద్ద కొనసాగుతోంది. గత 25 ఏళ్ల ట్రెండ్‌ను పరిశీలిస్తే బంగారం సగటుగా ప్రతి ఏడాది 12 నుంచి 14 శాతం వరకు వృద్ధి చూపించింది. కొన్ని సంవత్సరాల్లో ఈ వృద్ధి మరింత ఎక్కువగానే నమోదైంది. 2000లో 10 గ్రాముల బంగారం ధర రూ.4,400 మాత్రమే ఉండగా, 2025 నాటికి అది రూ.1.25 లక్షలకు చేరుకోవడం ఈ పెరుగుదలకు స్పష్టమైన ఉదాహరణ.

మార్కెట్ నిపుణుల అంచనా ప్రకారం వచ్చే ఐదేళ్లలో కూడా ఇదే స్థాయిలో లేదా అంతకంటే ఎక్కువగా బంగారం ధరలు పెరిగే అవకాశముంది. ఈsame ట్రెండ్ కొనసాగితే 2030 నాటికి 10 గ్రాముల బంగారం ధర కనీసం రూ. 2.50 లక్షలకు చేరే అవకాశం ఉందని పలు నివేదికలు చెబుతున్నాయి. మరికొన్ని అంతర్జాతీయ నివేదికలు మాత్రం ధరలు ఇంకా ఎక్కువగా పెరిగి 10 గ్రాములు రూ. 7 లక్షలకు కూడా చేరవచ్చని అంచనా వేస్తున్నాయి.

అలా కనీస అంచనాను తీసుకున్నా ఈరోజు రూ.5 లక్షల బంగారాన్ని కొనుగోలు చేస్తే, 2030 నాటికి దాని విలువ దాదాపు రూ.10 లక్షలకు చేరే అవకాశముంది. అంటే సరాసరి రెట్టింపు రాబడి రావచ్చన్న మాట. గరిష్ఠ అంచనాలను పరిగణలోకి తీసుకుంటే అది రూ.15 లక్షల నుంచి రూ.20 లక్షల వరకు కూడా పెరిగే అవకాశాన్ని కొట్టిపారేయలేము. అయితే బంగారం ధరలు పూర్తిగా మార్కెట్ పై ఆధారపడి ఉంటాయని నిపుణులు హెచ్చరిస్తున్నారు. ప్రపంచ ఆర్థిక పరిస్థితులు, కేంద్ర బ్యాంకుల వడ్డీ రేట్లు, డాలర్ బలం, అంతర్జాతీయ పరిణామాలు అన్నీ బంగారం ధరలపై ప్రభావం చూపుతాయి. అందుకే బంగారంలో పెట్టుబడి పెట్టే ముందు వ్యక్తిగత ఆర్థిక పరిస్థితులను, దీర్ఘకాల లక్ష్యాలను పరిగణలోకి తీసుకుని నిర్ణయం తీసుకోవాలని ఆర్థిక విశ్లేషకులు సూచిస్తున్నారు. గమనిక: ఇది మార్కెట్ అంచనాలపై ఆధారపడ్డ సమాచారం మాత్రమే. పెట్టుబడి నిర్ణయాల కోసం ఆర్థిక నిపుణులను సంప్రదించుకోవడం మంచిది.

# సిబిల్ స్కోర్‌లో పొరపాట్లు..

## వెంటనే సరిచేయకపోతే లోన్ డేంజర్‌లో పడినట్టే




నేటి బ్యాంకింగ్ వ్యవస్థలో సిబిల్ స్కోర్ కీలక పాత్ర పోషిస్తోంది. వ్యక్తిగత రుణం కావాలన్నా, గృహ రుణం తీసుకోవాలన్నా, క్రెడిట్ కార్డు అప్లై చేయాలన్నా మొదట బ్యాంకులు చూసేది సిబిల్ స్కోర్‌నే. ఇది 750 కంటే ఎక్కువగా ఉంటేనే చాలా బ్యాంకులు రుణాలకు గ్రీన్ సిగ్నల్ ఇస్తాయి. అలాంటప్పుడు సిబిల్ స్కోర్‌లో చిన్న పొరపాటు ఉన్నా అది పెద్ద సమస్యగా మారే అవకాశం ఉంది. చాలామంది "ఏమీ కాదు" అని వదిలేస్తారు కానీ అదే తప్పు భవిష్యత్తులో లోన్ రిజెక్షన్‌కు కారణమవుతుంది.

సిబిల్ స్కోర్‌ను రెగ్యులర్‌గా చెక్ చేస్తూ ఉండటం వల్ల మీ వ్యక్తిగత వివరాల్లో, అకౌంట్ డేటాలో ఏవైనా తప్పులు ఉంటే వెంటనే గుర్తించవచ్చు. పేరు, పాన్ నంబర్, ఆధార్, చిరునామా లాంటి వివరాలు తప్పుగా నమోదు అయినా, మీరు చెల్లించని లేట్ పేమెంట్స్ మీ పేర మీద కనిపించినా, క్లోజ్ అయ్యి లోన్ ఇంకా ఓపెన్‌గా చూపించినా ఇవన్నీ సిబిల్ స్కోర్‌ను నాశనం చేస్తాయి. ఇలాంటి పొరపాట్లు చాలాసార్లు బ్యాంక్ లేదా క్రెడిట్ బ్యూరో డేటా ఎంట్రీ తప్పుల వల్ల జరుగుతుంటాయి.

సిబిల్ స్కోర్‌ను ప్రతి ఏడాది ఒక్కసారి ఉచితంగా చెక్ చేసుకునే హక్కు ప్రతి భారతీయుడికి ఉంది. ఆర్‌బీఐ ఆమోదం పొందిన నాలుగు క్రెడిట్ బ్యూరోలు అయిన సిబిల్, సీఆర్ఐఎఫ్ హై మార్క్, ఎక్స్పీరియన్, ఈక్విఫ్యాక్స్ ద్వారా మీరు మీ క్రెడిట్ రిపోర్ట్‌ను పొందవచ్చు. ఆయా అధికారిక వెబ్‌సైట్లలోకి వెళ్లి మీ పాన్ నంబర్, మొబైల్ నంబర్, జన్మతేది వివరాలు ఇచ్చి లాగిన్ అయితే పూర్తి రిపోర్ట్ లభిస్తుంది.

రిపోర్ట్ వచ్చిన తర్వాత ముందుగా మీ వ్యక్తిగత వివరాలు సరిగా ఉన్నాయా లేదా అని పరిశీలించాలి. ఆ తర్వాత మీ బ్యాంక్ అకౌంట్లు, లోన్లు, క్రెడిట్ కార్డులు, ఈఎంఐ వివరాలు కరెక్ట్‌గా నమోదయ్యాయా లేదా చూసుకోవాలి. మీరు ఇప్పటికే క్లోజ్ చేసిన లోన్ ఇంకా ఆన్‌డీగా చూపిస్తే లేదా మీరు ఎప్పుడూ తీసుకోని కార్డు మీ పేర మీద ఉంటే, వెంటనే క్రెడిట్ బ్యూరోకి డిస్ప్యూట్ రైజ్ చేయాలి. సంబంధిత ఆప్షన్ వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంటుంది. మీరే ఆన్‌లైన్ ద్వారా ఫిర్యాదు నమోదు చేస్తే, బ్యూరో బ్యాంకులతో వెరిఫై చేసి కొద్ది రోజుల్లో మార్పులు చేస్తుంది.

తెలంగాణ ముచ్చట్లు
TELANGANA MUCHATLU
ఎడిటర్ : బొల్లెపాక రాజేష్
తెలుగు దిన పత్రిక

# మామూలు పెన్ను కాదు..



## రూ.17 కోట్ల విలువైన మోంట్‌బ్లాంక్ అద్భుతం

పెన్ను అంటే రోజూ ఉపయోగించే సాధారణ వస్తువుగా చాలామందికి అనిపిస్తుంది. కానీ కొన్ని పెన్నులు మాత్రం కళ, ప్రతిష్ట, వారసత్వానికి ప్రతీకలుగా మారిపోయాయి. అలాంటి ఒక అరుదైన లగ్జరీ పెన్నే మోంట్ బ్లాంక్ తయారు చేసిన తాజ్ మహల్ లిమిటెడ్ ఎడిషన్. దీని ధర వింటేనే నోరెళ్లబెట్టేలా ఉంటుంది. ఏకంగా రూ.17.35 కోట్లు. ప్రపంచంలో ఇంత ఖరీదైన పెన్ను ఉందా అని ఆశ్చర్యపోయేలా చేస్తున్న ఈ పెన్ను వెనుక ఉన్న కారణాలు మరింత ఆసక్తి కలిగిస్తున్నాయి.

జర్మనీలో 1906లో స్థాపితమైన మోంట్ బ్లాంక్ బ్రాండ్ ప్రపంచ లగ్జరీ రంగంలో తనకంటూ ప్రత్యేక గుర్తింపును సాధించింది. ఈ సంస్థ తయారు చేసే పెన్నులు సాధారణ ఫ్యాక్టరీ ఉత్పత్తులు కావు. ప్రతి ఒక్కదాన్ని నిపుణులైన హస్త కళాకారులు చేతితో తయారు చేస్తారు. ఒక్కో పెన్ను తయారీకి వందల గంటల సమయం పడుతుంది. ఎలాంటి చిన్న లోపం లేకుండా అత్యంత నాణ్యతతో తయారు చేయడమే మోంట్ బ్లాంక్ ప్రత్యేకత.


ఇక తాజ్ మహల్ లిమిటెడ్ ఎడిషన్ విషయానికి వస్తే ఇది ప్రపంచంలో మొత్తం పదిచ్చే పెన్నులే ఉన్నాయట. మొఘల్ కాలం నాటి తాజ్ మహల్ వాస్తుశిల్పం నుంచి ప్రేరణ పొంది ఈ పెన్నును రూపొందించారు. దీని డిజైన్‌లో తాజ్ మహల్ సౌందర్యాన్ని ప్రతిబింబించే సూక్ష్మ చెక్కుల పనితనం అద్భుతంగా ఉంటుంది. పెన్ను బాడీని విలువైన రెసిన్, స్వచ్ఛమైన బంగారం, ప్లాటినంతో తయారు చేశారు. అందులో నీలమణులు, కెంపులు, వజ్రాలను అమర్చారు. ఈ పెన్నులో ముఖ్యమైన భాగం నిబ్. ఇది సుమారు 18 క్యారెట్ బంగారంతో తయారు చేస్తారు. నిబ్‌పై మోంట్ బ్లాంక్ ఎత్తును సూచించే 4810 అనే సంఖ్యను చెక్కుతారు. ఇది బ్రాండ్‌కు సంకేతంగా ఉంటుంది. పెన్ను టోపీపై ఉన్న ఆరు మూలల నక్షత్రం మోంట్ బ్లాంక్ పర్వతం, దాని ఆరు హిమానీనదాలను సూచిస్తుంది. ఈ చిహ్నం బ్రాండ్ చరిత్ర, శక్తి, వారసత్వానికి సంకేతంగా నిలుస్తోంది.

ఈ పెన్ను విలువ దాని తయారీ పదార్థాల్లో మాత్రమే లేదు. ఇందులోని కళాత్మకత, పరిమిత సంఖ్యలో తయారు చేయడం, హస్తకళ విలువ, చరిత్రతో ముడిపడిన డిజైన్ అన్నీ కలిసే ఈ ఖరీదును తీసుకొచ్చాయి. ప్రపంచ వ్యాప్తంగా బిలియనీర్లు, రాజ కుటుంబాలు, అరుదైన వస్తువులు సేకరించే మాత్రమే ఇలాంటి పెన్నులను కలిగి ఉండగలుగుతున్నారు.

అక్షరాలు రాయడానికి మాత్రమే కాదు, కాలాన్ని దాటిపోయే కళాఖండాలుగా కూడా పెన్నులు మారతాయని ఈ మోంట్ బ్లాంక్ అద్భుతం మరోసారి నిరూపించింది. రోజువారీ జీవితంలో కనిపించే ఒక సాధారణ వస్తువును కోట్ల విలువ చేసే అరుదైన కళాఖండంగా మార్చిన ప్రతిభే దీనిని ప్రపంచంలో అత్యంత ఖరీదైన పెన్నులలో ఒకటిగా నిలిపింది

## చవక రీచార్జ్‌తో బీఎస్ఎన్ఎల్ మరోసారి సెన్సేషన్..

**రోజుకు కేవలం ₹6.74కే 72 రోజుల ప్లాన్**




**న్యూఢిల్లీ, నవంబర్ 23 డిజైనర్ టెక్ గురు ప్రతినిధి:** ప్రైవేట్ టెలికాం సంస్థల రీఛార్జ్ ధరలు రోజురోజుకు పెరుగుతుండగా, ప్రభుత్వ రంగ టెలికాం సంస్థ బీఎస్ఎన్ఎల్ మాత్రం తన చవక ప్లాన్‌లతో మళ్లీ మార్కెట్‌ను ఊపేసే ప్రయత్నం చేస్తోంది. ఇప్పటికే విద్యార్థుల కోసం ప్రత్యేక స్టూడెంట్ ప్లాన్ తీసుకువచ్చిన బీఎస్ఎన్ఎల్, ఇప్పుడు మరో సర్‌ప్రైజ్ రీచార్జ్ ప్లాన్‌ను అందుబాటులోకి తెచ్చింది. తక్కువ ధరలో ఎక్కువ ప్రయోజనాలు అందిస్తూ వినియోగదారుల దృష్టిని ఆకర్షిస్తోంది. కస్టమర్ల సంఖ్య పెంచుకోవడమే లక్ష్యంగా ప్రైవేట్ టెలికాం కంపెనీలకు పోటీగా వరుసగా కొత్త ఆఫర్లు తీసుకొస్తున్న బీఎస్ఎన్ఎల్, తాజాగా 72 రోజుల 'స్టార్ట్ సేవింగ్స్ ప్లాన్'ను ప్రవేశపెట్టింది. ఈ ప్లాన్ ధర కేవలం రూ.485 మాత్రమే. ఒక్కసారి రీచార్జ్ చేస్తే పూర్తి 72 రోజులు సేవలు అందుతాయి. ఈ ప్లాన్‌లో వినియోగదారులకు దేశవ్యాప్తంగా అపరిమిత వాయిస్ కాల్స్, రోజుకు 2 జీబీ హైస్పీడ్ డేటా, రోజుకు 100 ఎస్ఎంఎస్‌లు లభిస్తాయి. మొత్తం మీద ఈ ప్లాన్ రోజుకు కేవలం రూ.6.74 మాత్రమే ఖర్చవుతోంది. ప్రస్తుతం మార్కెట్లో ఇతర ప్రైవేట్ టెలికాం కంపెనీలు ఇలాంటి ప్రయోజనాల కోసం ఎక్కువ ధరలు వసూలు చేస్తుండగా, బీఎస్ఎన్ఎల్ ఇంత చవకగా ఈ సౌకర్యాలు ఇవ్వడం వినియోగదారులకు ఊరటనిచ్చే విషయంగా మారింది. గతంలో రూ.251 విలువైన ప్లాన్‌తో అన్‌లిమిటెడ్ సదుపాయాలు అందించి మంచి స్పందన పొందిన బీఎస్ఎన్ఎల్, ఇప్పుడు ఈ కొత్త ప్లాన్‌తో మళ్లీ కస్టమర్లను ఆకర్షించే ప్రయత్నం చేస్తోంది. ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాలు, తక్కువ ఆదాయం గల వర్గాల వినియోగదారులు ఈ ప్లాన్‌పై ఎక్కువ ఆసక్తి చూపుతున్నారు. అయితే, చవక ప్లాన్‌లు అందిస్తున్నప్పటికీ, కొన్ని ప్రాంతాల్లో నెట్‌వర్క్ సమస్యలు ఉండటం, మార్కెటింగ్ తక్కువగా ఉండటం వల్ల పూర్తి స్థాయిలో వినియోగదారులకు చేరుకోలేకపోతున్న విమర్శలు ఉన్నాయి. ఇక ఇటీవల 5జీ సేవలను కూడా ప్రారంభించిన బీఎస్ఎన్ఎల్, నెట్‌వర్క్ సమస్యలను పూర్తిగా పరిష్కరిస్తే మరింత పెద్ద ఎత్తున వినియోగదారులను ఆకర్షించే అవకాశం ఉందని నిపుణులు చెబుతున్నారు. ప్రైవేట్ సంస్థల అధిక టారిఫ్‌లతో ఇబ్బంది పడుతున్న వినియోగదారులకు ఈ 72 రోజుల రూ.485 ప్లాన్ నిజంగా చవక, చక్కటి ప్రత్యామ్నాయంగా మారే అవకాశముందని వినియోగదారులు అభిప్రాయపడుతున్నారు. ఇక రాబోయే రోజుల్లో బీఎస్ఎన్ఎల్ మరిన్ని ఇలాంటి ప్లాన్‌లు తీసుకువచ్చే సూచనలు కూడా కనిపిస్తున్నాయి.

# లక్షలోపే వస్తున్న ఎలక్ట్రిక్ స్కూటర్లు..



భారత ఆటోమొబైల్ రంగంలో ఎలక్ట్రిక్ వాహనాల జోరు రోజు రోజుకీ పెరుగుతోంది. పెట్రోల్ ధరల పెరుగుదల, కాలుష్యంపై పెరుగుతున్న ఆందోళనలు, ప్రభుత్వ రాయితీలు వంటి కారణాలతో ప్రజలు ఇప్పుడు ఎలక్ట్రిక్ స్కూటర్లవైపు ఎక్కువగా మొగ్గుచూపుతున్నారు. తక్కువ నిర్వహణ ఖర్చులు, నిశ్శబ్దంగా సాగే ప్రయాణం, ఆధునిక సౌకర్యాలు ఇవన్నీ ఈ వాహనాలకు మరింత ఆదరణ పెంచుతున్నాయి. ఈ తరుణంలో లక్ష రూపాయలలోపు ధరలో మూడు కొత్త శక్తివంతమైన ఎలక్ట్రిక్ స్కూటర్లు భారత మార్కెట్‌లోకి రానున్నాయి. అవి యమహా ఏరోక్స్ఈ, కొత్త తరం బజాజ్ చేతక్, అథర్ ఈఎల్.

యమహా ఏరోక్స్ఈ ప్రత్యేకంగా యువ రైడర్లను లక్ష్యంగా చేసుకుని స్పోర్టీ రూపంతో, శక్తివంతమైన పనితీరుతో రూపొందించారు. ఇందులో మధ్య భాగంలో అమర్చిన శక్తివంతమైన విద్యుత్ మోటార్ ఉంటుంది. ఇది బలమైన టార్క్‌ను అందించి వేగవంతమైన ప్రయాణాన్ని కల్పిస్తుంది. రెండు విడదీయగల బ్యాటరీలు కలిపి అధిక సామర్థ్యాన్ని ఇస్తాయి. ఒకసారి పూర్తిగా చార్జ్ చేస్తే వంద కిలోమీటర్లకు పైగా ప్రయాణించే వీలుంటుంది. ఈ స్కూటర్‌లో ఎకో, సాధారణ, పవర్ అనే మూడు ప్రయాణ విధానాలు ఉన్నాయి. వేగంగా దూసుకుపోవడానికి ప్రత్యేక బూస్ట్ విధానం కూడా ఉంది. ముందు టెలిస్కోపిక్ ఫోర్కులు, వెనుక ద్విగుణ షాక్ అబ్జార్బర్లు, సురక్షితమైన డిస్క్ బ్రేకులు ఉండటంతో రైడ్ మరింత స్థిరంగా ఉంటుంది. ఆధునిక డిజిటల్ కన్సోల్ ద్వారా మొబైల్ అనుసంధానం, మార్గదర్శనం, ప్రయాణ విశ్లేషణ వంటి సౌకర్యాలు లభిస్తాయి. ఇక కొత్త తరం బజాజ్ చేతక్ ఎలక్ట్రిక్ వాహనం భారతీయులకు సుపరిచితమైన చేతక్ బ్రాండ్‌కు కొత్త రూపం. ఎంట్రీ స్థాయి వినియోగదారులను దృష్టిలో పెట్టుకుని ఇది సరసమైన ధరలో వస్తోంది. క్లాసిక్ డిజైన్‌ను అలాగే ఉంచుతూ ఆధునిక ఎల్ఈడీ దీపాలు, కొత్త డిజిటల్ మీటర్, స్మార్ట్ సౌకర్యాలతో దీన్ని అభివృద్ధి చేశారు. తక్కువ ఖర్చుతో మోటార్ నిర్వహణ కోసం చక్రానికి నేరుగా అమర్చిన మోటార్‌తో దీన్ని రూపొందించారు. ఇందులో మూడు నుంచి మూడు నర కిలోవాట్ గంటల బ్యాటరీ ప్యాక్ ఉంటుంది. దీని ద్వారా సుమారు వంద ఇరవై నుంచి వంద యాభై కిలోమీటర్ల వరకు ప్రయాణించవచ్చు. స్కూటర్‌లో స్మార్ట్‌ఫోన్ అనుసంధానం, ప్రాంత పరిమితి గుర్తింపు, సంగీత నియంత్రణ, నావిగేషన్ వంటి సదుపాయాలు కూడా ఉంటాయి. దీని ధర లక్ష రూపాయలలోపే ఉండే అవకాశం ఉందని అంచనా. అథర్ ఈఎల్ మోడల్ కుటుంబ వినియోగదారులను దృష్టిలో పెట్టుకుని రూపొందిస్తున్న సరసమైన ఎలక్ట్రిక్ స్కూటర్. ఈ స్కూటర్ తేలికపాటి నిర్మాణం, బహుళ ప్రయోజనాల వాడకానికి అనుకూలంగా ఉంటుంది. రెండు నుంచి ఐదు కిలోవాట్ గంటల సామర్థ్యంతో బ్యాటరీని అమర్చే వీలుంది. దీని ద్వారా వంద నుంచి వంద యాభై కిలోమీటర్ల వరకు ప్రయాణించవచ్చు. ఆధునిక సాంకేతికతతో కృత్రిమ మేధస్సు ఆధారిత స్మార్ట్ సౌకర్యాలు ఇందులో ఉంటాయి. గృహ వినియోగానికి అనువైన ఈ వాహనాన్ని ఉత్తర, మధ్య భారత మార్కెట్లలో ఎక్కువగా విస్తరించాలనే ప్రణాళికలతో సంస్థ ముందుకు సాగుతోంది. రాబోయే కాలంలో దేశవ్యాప్తంగా వందలాది షోరూమ్‌లను ఏర్పాటు చేసి విక్రయాలను పెంచాలని భావిస్తోంది. ఈ మూడు ఎలక్ట్రిక్ స్కూటర్లు రావడంతో భారతదేశంలో ఎలక్ట్రిక్ రవాణా రంగం మరింత బలపడనుంది. సాధారణ ప్రజలకు అందుబాటులో ఉండే ధరల్లో, ఆధునిక సదుపాయాలతో వచ్చే ఈ వాహనాలు రాబోయే రోజుల్లో పెట్రోల్ స్కూటర్లకు గట్టి పోటీ ఇవ్వబోతున్నాయి. దీంతో భవిష్యత్తులో రోడ్లపై ఎలక్ట్రిక్ స్కూటర్ల సంఖ్య మరింతగా పెరగడం తథ్యం అన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది.

# విమాన రద్దుపై ప్రయాణికులకు ఊరట..




విమాన ప్రయాణికులకు పౌర విమాన యాన శాఖ శుభవార్త చెప్పే దిశగా కీలక నిర్ణయాలపై కసరత్తు చేస్తోంది. అత్యవసర పరిస్థితుల్లో విమానం బయలుదేరే కొద్దిసేపు ముందే టికెట్ రద్దు చేసుకున్నా కూడా, టికెట్ మొత్తంలో పెద్ద భాగాన్ని తిరిగి పొందేలా కొత్త విధానం తీసుకురావడానికి కేంద్రం ప్రయత్నాలు చేస్తోంది. ఈ కొత్త విధానం అమల్లోకి వస్తే, నో షో అంటూ ఇప్పటివరకు ప్రయాణికుల డబ్బు కోల్పోయిన పరిస్థితులకు పెద్ద ఊరట దక్కనుంది. ప్రస్తుతం విమానం బెయిలవేసే మూడు గంటల ముందు టికెట్ రద్దు చేస్తే లేదా ప్రయాణికుడు హాజరుకాకపోతే, ఎయిర్‌లైన్స్ దానిని 'నో షో'గా పరిగణించి రీఫండ్ ఇవ్వని పరిస్థితి ఉంది. కొన్నిసార్లు వైద్య అత్యవసర పరిస్థితులను నిరూపించినప్పుడు మాత్రమే కొంత మొత్తాన్ని వెనక్కి ఇస్తున్నారు. అయితే దీనిపై ప్రయాణికుల నుంచి పెద్ద ఎత్తున ఫిర్యాదులు వస్తుండటంతో, ఇకపై టికెట్‌లో ట్రావెల్ ఇన్సూరెన్స్‌ను తప్పనిసరి భాగంగా చేర్చే ప్రతిపాదనపై పౌర విమాన యాన శాఖ పని చేస్తోంది.

ఈ ఇన్సూరెన్స్ విధానం అమలులోకి వస్తే, చివరి నిమిషంలో రద్దు చేసుకున్నా కూడా టికెట్ మొత్తంలో సుమారు 80 శాతం వరకు తిరిగి పొందే అవకాశం కలుగుతుందని సమాచారం. అందుకు అవసరమైన ప్రీమియం భారం ప్రయాణికులపై కాకుండా ఎయిర్‌లైన్స్ కంపెనీలే భరించేలా ఒప్పందాలు కుదుర్చేందుకు ప్రభుత్వం ప్రయత్నిస్తోంది. ఇప్పటికే కొన్ని విమానయాన సంస్థలు ఇన్సూరెన్స్ కంపెనీలతో ఈ దిశగా చర్చలు మొదలుపెట్టినట్టు అధికారికంగా తెలిసింది.

ఇదే సమయంలో టికెట్ రీఫండ్ ప్రక్రియను మరింత పారదర్శకంగా, ప్రయాణికులకు అనుకూలంగా మార్చేందుకు డీజీసీఏ కూడా నిబంధనల సవరణపై దృష్టి పెట్టింది. రీఫండ్ ఆలస్యం, కారణాలు లేకుండా తిరస్కరణలు వంటి సమస్యలు తలెత్తకుండా పటిష్ఠమైన మార్గదర్శకాలు రూపొందించేందుకు ముసాయిదా నిబంధనలపై పని జరుగుతోంది. రాబోయే రెండు నుంచి మూడు నెలల్లో ఈ కొత్త నియమాలు అమలులోకి వచ్చే అవకాశముందని పౌర విమానయాన శాఖ వర్గాలు వెల్లడిస్తున్నాయి.

ఈ మార్పుల ద్వారా విమాన ప్రయాణికుల హక్కులు మరింత బలపడతాయని, ముఖ్యంగా అత్యవసర పరిస్థితుల్లో ఉన్న వారికి పెద్ద ఊరట కలుగుతుందని అధికారులు చెబుతున్నారు. దీంతో విమాన రద్దు విషయంలో ఇప్పటిదాకా ఉన్న భారం, అసహనం కొంత మేర తగ్గుతుందని ప్రయాణికులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

# టాటా ప్రియులకు శుభవార్త..

## మార్కెట్‌ను కుదిపేస్తున్న కొత్త సియెర్రా కారు




టాటా మోటార్స్ అభిమానులకు ఆనందకరమైన సమాచారం వచ్చింది. ఎన్నో ఏళ్ల తర్వాత మళ్లీ టాటా సియెర్రా పేరుతో వచ్చిన కొత్త మోడల్ కారు ఈ నెల 25న అధికారికంగా విడుదల కానుంది. ఒకప్పుడు దేశవ్యాప్తంగా మంచి పేరు తెచ్చుకున్న సియెర్రాను ఇప్పుడు పూర్తిగా కొత్త అవతార్‌లో తీసుకొస్తూ, ప్రయాణికుల అవసరాలకు తగ్గ విధంగా ఆధునిక సౌకర్యాలతో సిద్ధం చేశారు. పెట్రోల్, డీజిల్‌తో పాటు పూర్తిగా విద్యుత్తుతో నడిచే వేరియంట్‌లలో కూడా ఈ కారు మార్కెట్లోకి వస్తోంది. ఈ కొత్త సియెర్రా డిజైన్ పాత మోడల్‌కు గుర్తు చేస్తూనే, ఆధునిక ఆకృతితో ఆకట్టుకునేలా తయారు చేశారు. బలమైన ముందు భాగం, వెడల్పైన బాడీ, పెద్ద గాజు పైకప్పు వంటి లక్షణాలు దీని ప్రత్యేకత. లోపల ప్రయాణికుల సౌకర్యం కోసం మూడు డిజిటల్ స్క్రీన్ల అమరికను అందించారు. డ్రైవర్ ముందు డిజిటల్ మీటర్, మధ్య భాగంలో పెద్ద టచ్ స్క్రీన్, ముందు సీట్లో కూర్చునే వారికి ప్రత్యేక స్క్రీన్ ఉండేలా రూపకల్పన చేశారు. ఉత్తమ నాణ్యత గల ధ్వని వ్యవస్థతో సంగీత ప్రియుల్ని కూడా ఆకట్టుకునేలా చేశారు. భద్రత విషయంలో కూడా టాటా కంపెనీ ఎలాంటి రాజీ పడలేదు. ఆరు గాలిబ్యాగులు, జారిపోకుండా ఉండే బ్రేకింగ్ వ్యవస్థ, ఎక్కె దిగే దారుల్లో కారును నిలబెట్టే సదుపాయం, టైర్లలో గాలి పీడనాన్ని చూపించే వ్యవస్థ, చుట్టూ చూపించే కెమెరా వంటి అనేక భద్రతా ఫీచర్లు అందించారు. అలాగే మార్గంలో లేన్ మార్చేటప్పుడు సహాయపడే, ప్రమాదం జరుగకముందే హెచ్చరించే ఆధునిక భద్రతా సాంకేతికతను కూడా ఇందులో పొందుపరిచారు. ఇంజిన్ పరంగా పెట్రోల్, డీజిల్ మోడళ్లతో పాటు విద్యుత్తుతో నడిచే వేరియంట్ కూడా అందుబాటులోకి రానుంది. విద్యుత్తు మోడల్ ఒకసారి పూర్తిగా చార్జ్ చేస్తే ఐదు వందల కిలోమీటర్లకు పైగా ప్రయాణించే సామర్థ్యం ఉంటుందని కంపెనీ వర్గాలు చెబుతున్నాయి. మధ్యతరహా కార్ల విభాగంలో ఈ సియెర్రా ఇప్పటికే ఉన్న ప్రముఖ కంపెనీల మోడళ్లకు గట్టి పోటీ ఇవ్వనుంది. ప్రారంభ ధర సుమారు పదకొండు లక్షల రూపాయల నుంచి ఉండగా, టాప్ మోడళ్ల ధర ఇరవై లక్షల రూపాయల వరకు ఉండే అవకాశం ఉందని అంచనా. విద్యుత్తు వేరియంట్ ధర ఇరవై నుంచి ఇరవై అయిదు లక్షల మధ్య ఉండొచ్చని సమాచారం. పాత జ్ఞాపకాలను గుర్తు చేస్తూ, కొత్త సాంకేతికతతో మార్కెట్లోకి వస్తున్న టాటా సియెర్రా కారు త్వరలోనే రోడ్లపై కనువిందు చేసేందుకు సిద్ధంగా ఉంది. టాటా అభిమానులతో పాటు వాహన ప్రేమికులందరిలోనూ దీనిపై భారీ అంచనాలు నెలకొన్నాయి.

# కార్డు అప్పుల నుంచి బయట పడాలంటే ఇవే మార్గాలు

క్రెడిట్ కార్డు ఉంది కదా అని విచ్చలవిడిగా ఖర్చు చేస్తూ చివరకు బిల్లులు కట్టలేక అప్పులపాలవుతున్న వారి సంఖ్య దేశంలో రోజురోజుకీ పెరుగుతోంది. మొదట్లో చిన్న మొత్తం అనుకుని వాడిన కార్డు ఖర్చు, వడ్డీలతో కలిపి పెద్ద భారం అవుతోంది. కానీ సరైన అవగాహనతో, కొంచెం క్రమశిక్షణతో క్రెడిట్ కార్డును వాడితే అదే మీకు ఆర్థికంగా సహాయపడే సాధనంగా మారుతుంది. అప్పుల ఊబిలో నుంచి బయట పడేందుకు కొన్ని ప్రాథమిక విషయాలను పాటిస్తే చాలు అని ఆర్థిక నిపుణులు చెబుతున్నారు. క్రెడిట్ కార్డు వాడేటప్పుడు ముఖ్యంగా గుర్తుంచుకోవాల్సింది బిల్లు చెల్లింపు. మినిమమ్ డ్యూ కట్టి చేతులు దులుపుకోవడం చాలా మందికి అలవాటు. కానీ ఇలా చేస్తే మిగిలిన మొత్తంపై భారీ వడ్డీ పడుతుంది. అదే పూర్తి బిల్లు సకాలంలో చెల్లిస్తే వడ్డీ భారం ఉండదు, సిబిల్ స్కోర్ కూడా మెరుగవుతుంది. సకాలంలో బిల్లులు చెల్లించడం వల్ల భవిష్యత్తులో తక్కువ వడ్డీకి లోన్లు దొరికే అవకాశం కూడా పెరుగుతుంది. చాలామంది బిల్లులు మర్చిపోవడం వల్ల ఆలస్యంగా చెల్లించి పెనాల్టీలు ఎదుర్కొంటున్నారు. దీనిని నివారించడానికి పేమెంట్ రిమైండర్ సెట్ చేసుకోవాలి. మొబైల్ యాప్ లేదా బ్యాంకు వెబ్‌సైట్ ద్వారా అలర్ట్స్ పెట్టుకోవచ్చు. ఆటో డెబిట్ ఆప్షన్ ఎంచుకుంటే ఇంకా సులువు. అప్పుడు మీ బ్యాంక్ ఖాతా నుంచి బిల్లు మొత్తం ఆటోమేటిక్‌గా కట్ అవుతుంది. దీంతో ఆలస్యం అనే సమస్యే ఉండదు. క్రెడిట్ కార్డు వాడుతున్న వారు తరచూ స్టేట్‌మెంట్‌ను చెక్ చేసుకోవడం కూడా అవసరం. నెలవారీ స్టేట్‌మెంట్ చూస్తే ఎంతెంత ఖర్చు చేశామో, ఏ అవసరానికి ఎక్కువ డబ్బు పోయిందో తెలుస్తుంది. అలా చూసుకుని అనవసర ఖర్చులను తగ్గించుకోవచ్చు. కొన్ని బ్యాంకులు ఖర్చులను వర్గీకరించి చూపించే డిజిటల్ టూల్స్ అందుబాటులో పెట్టాయి. వాటిని ఉపయోగించుకుంటే మరింత స్పష్టత వస్తుంది. ఇంకో ముఖ్యమైన విషయం ఏమిటంటే, అవసరానికి మించి ఎక్కువ క్రెడిట్ కార్డులు తీసుకోవద్దు. ఆఫర్లు, క్యాష్‌బ్యాక్లు ఉన్నాయనే కారణంతో అనేక కార్డులు వాడితే ప్రతి కార్డు బిల్లును ట్రాక్ చేయడం కష్టమవుతుంది. అంతేకాదు, తక్కువ కాలంలో అనేక కార్డులకు అప్లై చేస్తే మీ క్రెడిట్ ప్రొఫైల్‌పై ప్రతికూల ప్రభావం పడుతుంది. ఒక్కటి లేదా రెండు కార్డులే సరిపడేలా చూసుకుని వాటిని బాధ్యతగా వాడితే మంచిది. ఆర్థిక నిపుణుల మాటల్లో చెప్పాలంటే, క్రెడిట్ కార్డు శత్రువు కాదు.. మీ చేతిలో ఉన్న ఆయుధం. మీరు దాన్ని ఎలా ఉపయోగిస్తారన్నదానిపైనే అది మీకు మేలు చేస్తుందా లేదా అప్పులుగా మారుతుందా అనేది ఆధారపడి ఉంటుంది. కాబట్టి జాగ్రత్తగా వాడితే క్రెడిట్ కార్డు మీ ఆర్థిక జీవితానికి సహాయకుడే అవుతుంది.



# వికసిత్ భారత్ లక్ష్యానికి సివిల్ సర్వెంట్లు కీలకం

- కొత్త సాంకేతికతలు, నిరంతర అధ్యయనం అనివార్యం
- జట్టు పని, అంతిమ దశ సేవల అందుబాటు పై ప్రత్యేక హితవు

పాలసముద్రం, 23 నవంబర్ (డిజైనర్ టెక్ గురు ప్రతినిధి): ఆంధ్రప్రదేశ్‌లోని పాలసముద్రంలో ఉన్న నేషనల్ అకాడమీ ఆఫ్ కస్టమ్స్, ఇండైరెక్ట్ టాక్సెస్ అండ్ నార్కోటిక్స్ లో సివిల్ సర్వీసెస్ శిక్షణార్థులతో భారత ఉపరాష్ట్రపతి సీపీ రాధాకృష్ణన్ మేళవించారు. 2024లో ప్రధాని ప్రారంభించిన ఈ కొత్త క్యాంపస్ ఇప్పుడు కస్టమ్స్, జీఎస్టీ పరిపాలనలో దేశంలోనే అగ్రగామి శిక్షణ కేంద్రంగా ఎదిగిందని ఆయన గుర్తుచేశారు.

వికసిత్ భారత్ @2047 లక్ష్య సాధనలో సివిల్ సర్వెంట్లు ముఖ్య భూమిక పోషించాల్సి ఉంటుందని ఉపరాష్ట్రపతి సూచించారు. అంతిమ దశ సేవల అందుబాటు, జట్టు పని, సమగ్ర వృద్ధి వంటి అంశాలను అవలంబించడం అవసరమని పేర్కొన్నారు. వ్యక్తిగత ప్రావీణ్యంపై కాకుండా జట్టు ప్రదర్శనను ప్రాముఖ్యంగా తీసుకోవాలని శిక్షణార్థులకు ఆయన సూచించారు.

కృత్రిమ మేధస్సు, సహజ భాషా ప్రక్రియ, మెషీన్ లెర్నింగ్, బ్లాక్‌చెయిన్ వంటి కొత్త సాంకేతికతలను స్వీకరించడంలో సివిల్ సర్వెంట్లు ముందుండాలని ఉపరాష్ట్రపతి పిలుపునిచ్చారు. ఈ సాంకేతికతలు పారదర్శకత, సామర్థ్యం, ప్రజాసేవల మెరుగుదలకు కొత్త అవకాశాలు తెరవనున్నాయని చెప్పారు. కర్మయోగి మాడ్యూల్‌ను ఎక్కడైనా, ఎప్పుడైనా సామర్థ్య వృద్ధికి ఉపయోగపడే అద్భుత వేదికగా అభివర్ణించారు.

ఈ కార్యక్రమానికి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ హృద, ఐటీ, ఎలక్ట్రానిక్స్ & కమ్యూనికేషన్, శాఖల మంత్రి నారా లోకేష్, ఉపరాష్ట్రపతి కార్యదర్శి అమిత్ ఖరే, డైరెక్టర్ జనరల్ సుబ్రహ్మణ్యం తదితర ప్రముఖులు హాజరయ్యారు.






# భారత్–నెదర్లాండ్స్ భాగస్వామ్యం మరింత బలోపేతం

- జి20 జోహన్నెస్‌బర్గ్ శిఖరాగ్ర సమావేశం పక్కన రెండు దేశాల నేతల భేటీ
- నీటి వనరులు, ఆవిష్కరణ, సాంకేతికత–శక్తి రంగాల్లో వేగంగా సహకారం
- వాణిజ్య–పెట్టుబడి సంబంధాలను మరింతగా విస్తరించనున్న భారత ప్రతినిధులు

జోహన్నెస్‌బర్గ్, 23 నవంబర్ (డిజైనర్ టెక్ గురు ప్రతినిధి): జి20 సమ్మిట్ సందర్భంగా నెదర్లాండ్స్ ప్రధాని డిక్ స్కూఫ్‌ను జోహన్నెస్‌బర్గ్‌లో భారత ప్రధాని నరేంద్ర మోడీ కలిసారు. రెండు దేశాల మధ్య ద్వైపాక్షిక సహకారం నీటి వనరుల నిర్వహణ, ఆవిష్కరణలు, సాంకేతిక అభివృద్ధి, శక్తి రంగాల్లో వేగంగా విస్తరిస్తోందని ఈ సమావేశంలో అధికారులు వివరించారు.

భారత్-నెదర్లాండ్స్ సంబంధాలు గత కొన్ని సంవత్సరాల్లో మరింత వ్యూహాత్మక దిశగా అభివృద్ధి చెందాయి. ముఖ్యంగా నీటి పారుదల, వరదల నివారణ, సాగు నీటి సమర్థ వినియోగం వంటి రంగాల్లో నెదర్లాండ్స్ నైపుణ్యాన్ని భారత్ విస్తృతంగా ఉపయోగించుకుంటోంది. సాంకేతిక పరిజ్ఞానం, పునరుత్పాదక శక్తి, నవీన ఆవిష్కరణల మార్పిడి ద్వారా రెండు దేశాల ప్రయోజనాలు పెరుగుతున్నాయి. వాణిజ్యం, పెట్టుబడుల విస్తరణకు రెండు దేశాలు సమాన ప్రాధాన్యం ఇస్తున్నాయి. భవిష్యత్తులో వాణిజ్య సంబంధాలను మరింత లోతుగా తీసుకెళ్తూ పెట్టుబడుల ప్రవాహాన్ని పెంపొందించే దిశగా చర్యలు చేపట్టాలని నిర్ణయించారు. రెండు దేశాల పరిశ్రమలు, స్టార్టప్స్, పరిశోధనా సంస్థల మధ్య సహకారాన్ని మరింత బలోపేతం చేయనున్నట్లు కూడా ఈ భేటీ సందర్భంగా వెల్లడైంది.

ఈ సమావేశం ద్వారా భారత్-నెదర్లాండ్స్ స్నేహం కొత్త దశలోకి అడుగుపెడుతోందని ప్రతినిధులు పేర్కొన్నారు.





# సరిహద్దులు మారొచ్చు: రాజ్‌నాథ్ సింగ్



భారత విభజన సమయంలో పాకిస్తాన్‌కు వెళ్లిపోయిన సింధ్ అనే ప్రాంతం తిరిగి మన సరిహద్దుల్లో భాగం కావొచ్చని కేంద్ర రక్షణమంత్రి రాజ్‌నాథ్ స్పష్టం చేశారు. ప్రస్తుతం సింధ్ ప్రాంతం భారతదేశంలో భాగంగా లేదు కానీ ఆ నాగరికత సౌరసత్వం అనేది మనకే అనుసంధానమై ఉన్నందును తిరిగి భారత్‌లో విలీనం అయ్యే అవకాశం ఉందన్నారు. ఢిల్లీలో ఆదివారం సింధి సమాజ్ సమ్మేళన్ ఈవెంట్‌లో పాల్గొన్న రాజ్‌నాథ్ సింగ్.. ఈ మేరకు వ్యాఖ్యలు చేశారు.

అప్పుడు ఎప్పుడో పాకిస్తాన్‌కు వెళ్లిపోయిన ఆ ప్రాంతం.. తిరిగి మన భారత దేశంలో భాగమవడానికి అవకాశం ఉందన్నారు. సింద్ అనేది ఎప్పటికీ మన దేనని, సరిహద్దులు అనేవి భౌగోళికంగా మారుతుంటాయన్నారు. కాగా, సింధ్ ప్రాంతం ప్రస్తుతం పాకిస్తాన్‌లో ఉంది. ఇది పాకిస్తాన్‌లోని నాలుగు ప్రధాన ప్రావిన్స్‌లలో ఒకటి. 1947లో భారత విభజన సమయంలో సింధ్ పాకిస్తాన్‌లో భాగమైంది. ఆ సమయంలో అనేక మంది సింధీ హిందువులు భారతదేశానికి వలస వెళ్లారు. సింధ్ ప్రాంతం మోహెంజోదారో వంటి పురాతన సింధు లోయ నాగరికత స్థలాలకు ప్రసిద్ధి. సింధ్ ప్రావిన్స్‌కు కరాచీ రాజధానిగా ఉంది.

# దుబాయ్ ఎయిర్ షోలో తేజస్ జెట్ ప్రమాదం: వింగ్ కమాండర్ నమాన్ష్ సయాల్ మృతి

రెండు రోజుల క్రితం దుబాయ్‌లో జరిగిన ఎయిర్ షోలో తేజస్ జెట్ కూలి వింగ్ కమాండర్ నమాన్ష్ సయాల్ మృతిచెందారు. అయితే ఆ ప్రమాద సమయంలో పైలట్ జెట్ నుంచి దూకి తప్పించుకొనే ప్రయత్నం చేశాడని దర్యాప్తు బృందాలు తెలిపాయి. కానీ ఆయన అలా చేయకపోవడానికి జెట్‌లో ఏదైనా సాంకేతిక కారణాలు తలెత్తి ఉండవచ్చని లేదా పైలట్ ఆరోగ్య పరిస్థితులైనా సహకరించకపోయి ఉండచ్చని దర్యాప్తు బృందాలు పేర్కొన్నాయి.



ఆ వివరాలు జెట్‌కు సంబంధించిన బ్లాక్ బాక్స్ ఓపెన్ చేస్తే తెలుస్తాయని ఎయిర్ ఫోర్స్ మాజీ అధికారులు తెలిపారు. కాగా ఎయిర్ షో ప్రారంభానికి ముందు వింగ్ కమాండర్ సయాల్ కేంద్ర సహాయ మంత్రి సంజయ్ సేత్, యూఏఈ భారత రాయభారి దీపక్ మిట్టల్ తో మాట్లాడుతున్న వీడియో వైరలవుతోంది. అందులో నిమాన్ష్ సరదాగా నవ్వుతూ అధికారులతో మాట్లాడుతున్నారు.

వింగ్ కమండర్ నమాన్ష్ సయాల్ అంత్యక్రియలు నేడు హిమాచల్ ప్రదేశ్ లోని తన స్వంత గ్రామం పాటియాల్కర్ లో జరిగాయి. తన కుటుంబ సభ్యులతో పాటు ఎయిర్‌ఫోర్స్ అధికారులు, స్థానికులు పెద్దఎత్తున హాజరై నమాన్ష్‌కు ఘన నివాళులు అర్పించారు.



# అంధ మహిళా క్రికెట్‌లో భారత జట్టు స్వర్ణ చరిత్ర

ప్రపంచ అంధ మహిళల క్రికెట్‌లో భారత జట్టు సరికొత్త అధ్యాయాన్ని నమోదు చేసింది. తొలిసారిగా నిర్వహించిన అంధ మహిళల టీ20 వరల్డ్ కప్‌లో భారత్ ఆది నుంచి చివరి వరకు అద్భుత ఆటతీరుతో అదరగొట్టి ట్రోఫీని తన ఖాతాలో వేసుకుంది. కొలంబోలోని సరా ఓవల్ మైదానంలో ఆదివారం జరిగిన ఫైనల్‌లో నేపాల్‌పై ఘన విజయం సాధించి తొలి సీజన్ ఛాంపియన్‌గా చరిత్ర సృష్టించింది.

ముందుగా బ్యాటింగ్ చేసిన నేపాల్ జట్టును భారత బౌలర్లు కట్టడి చేశారు. క్రమశిక్షణతో బంతులు విసిరిన భారత బౌలింగ్ యూనిట్ ప్రత్యర్థిని కేవలం 114 పరుగులకే పరిమితం చేసింది. కీలక సమయంలో వికెట్లు తీసి మ్యాచ్‌పై పూర్తి ఆధిపత్యం చూపింది. ఆ తరువాత ఛేదనలో భారత బ్యాటర్లు ఏమాత్రం ఒత్తిడికి లోనుకాకుండా లక్ష్యాన్ని సునాయాసంగా ఛేధించారు. ఓపెనర్ ఫులా సరేన్ దూకుడుగా బ్యాటింగ్ చేస్తూ 44 పరుగులతో జట్టుకు బలమైన ఆరంభం ఇచ్చింది. పదో ఓవర్‌కే స్కోర్ వంద దాటడంతో మ్యాచ్ దిశ పూర్తిగా భారత్‌వైపు మళ్లింది. కేవలం 13 ఓవర్లలోనే లక్ష్యాన్ని ఛేదించిన భారత్ 7 వికెట్ల తేడాతో అద్భుత విజయం సాధించింది. టోర్నీ మొత్తం భారత జట్టు ఆధిపత్యంతోనే సాగింది. సెమీఫైనల్లో ఆస్ట్రేలియాను చిత్తు చేసి ఫైనల్‌కు చేరిన టీమిండియా, చివరి పోరులోనూ అదే జోరు కొనసాగించింది. అటు బ్యాటింగ్, ఇటు బౌలింగ్, ఫీల్డింగ్‌తో అన్ని విభాగాల్లోనూ మెరుగైన ప్రదర్శన చూపింది. ఫైనల్ మ్యాచ్‌లో కీలకమైన ఇన్నింగ్స్ ఆడిన ఫులా సరేన్‌కు 'ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్' అవార్డు దక్కింది. చేపట్టిన ప్రతి అవకాశం సద్వినియోగం చేసుకుంటూ, ఎలాంటి ఆటంకాలు ఎదురైనా తలవంచకుండా పోరాడిన ఈ అంధ మహిళల జట్టు దేశానికి గర్వకారణంగా మారింది. తొలి సీజన్‌లోనే ప్రపంచ టైటిల్ సాధించడం భారత అంధ క్రికెట్ చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోతుందని క్రీడా విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. దేశవ్యాప్తంగా ఈ విజయంపై క్రీడాభిమానులు హర్షం వ్యక్తం చేస్తుండగా, సోషల్ మీడియాలో భారత అంధ మహిళల జట్టును ప్రశంసల వర్షం కురుస్తోంది.

# భారత్ ఓపెనర్ల గట్టి ధీమా..

### గువహటిలో దక్షిణాఫ్రికా భారీ స్కోర్‌కి సమాధానం ప్రారంభం





గువహటి వేదికగా జరుగుతున్న రెండో టెస్టులో దక్షిణాఫ్రికా 489 పరుగుల భారీ స్కోరు నమోదు చేసి భారత్‌పై ఒత్తిడి పెంచింది. తొలి ఇన్నింగ్స్‌లో ముత్తుస్వామి శతకం, మార్కో జాన్సెన్ ధాటైన ఇన్నింగ్స్‌తో ప్రోటీస్ బ్యాటర్లు భారత బౌలర్లకు గట్టి పరీక్ష పెట్టారు. రెండో రోజు లంచ్ తర్వాత పూర్తి ఆధిపత్యంతో బ్యాటింగ్ చేసి 151.1 ఓవర్లకు ఆలౌటయ్యారు. భారత బౌలర్లలో కుల్‌దీప్ యాదవ్ 4 వికెట్లు తీసి శ్రమించగా, బుమ్రా, సిరాజ్, జడేజా చెరో రెండు వికెట్లు పడగొట్టారు.

ఈ భారీ లక్ష్యాన్ని ఎదుర్కొంటూ భారత్ తొలి ఇన్నింగ్స్‌ను ప్రారంభించింది. కష్టతరమైన పరిస్థితుల్లో క్రీజ్‌లోకి వచ్చిన ఓపెనర్లు యశస్వి జైశ్వాల్, కేఎల్ రాహుల్ మంచి సహనం చూపించారు. బౌలింగ్ అనుకూలంగా ఉన్న పిచ్‌పై దక్షిణాఫ్రికా పేసర్ల స్పీడ్, బౌన్స్‌ను సమర్థంగా ఎదుర్కొంటూ తొలి 6.1 ఓవర్లలో వికెట్ నష్టం లేకుండా 9 పరుగులు చేశారు. జైశ్వాల్ 7, రాహుల్ 2 పరుగులతో క్రీజ్‌లో నిలిచారు. వెలుతురు తగ్గడంతో అంపైర్లు తొందరగా ఆట ముగించారు.

భారీ స్కోరుతో పెరిగిన ఒత్తిడిలో కూడా భారత్ తొలి ఇన్నింగ్స్ ఆరంభాన్ని నిలకడగా కొనసాగించడం అభిమానులకు ఊరటనిచ్చే అంశంగా మారింది. ఇక మ్యాచ్ మూడో రోజు బ్యాటింగ్ ఎలా సాగుతుందో, భారత్ ఈ స్కోర్‌కు ఎలా పోటీనిస్తుందోనన్న ఆసక్తి పెరుగుతోంది.

# మంధాన పెళ్లి వాయిదా..

### తండ్రి అనారోగ్యంతో కుటుంబంలో ఆందోళన



భారత మహిళా క్రికెట్ జట్టు స్టార్ బ్యాటర్ స్మృతి మంధాన జీవితంలో ప్రత్యేకంగా జరగాల్సిన శుభలేఖల రోజులుw అనుకోకుండా విషాద వాతావరణంలోకి మారిపోయాయి. గత కొన్ని రోజులుగా హల్దీ, మెహందీ, సంగీత్ వంటి పెళ్లి కార్యక్రమాలు కుటుంబసభ్యులు, సన్నిహితుల మధ్య ఘనంగా జరిగాయి. పెళ్లి కూడా భారీ హంగులతో జరగనుందనే వేళ, మంధాన తండ్రి శ్రీనివాస్‌కు ఒక్కసారిగా అస్వస్థత ఏర్పడింది. దీంతో వెంటనే ఆయనను ఆస్పత్రికి తరలించి వైద్యం అందిస్తున్నారు.

తండ్రి ఆరోగ్య పరిస్థితిపై కుటుంబం పూర్తిగా దృష్టి పెట్టాల్సిన పరిస్థితి రావడంతో మంధాన, పలాశ్ ముచ్చల్ తమ వివాహాన్ని తాత్కాలికంగా వాయిదా వేయాలని నిర్ణయించుకున్నారు. ఈ విషయాన్ని మంధాన మేనేజర్ తుహిన్ మిశ్రా అధికారికంగా వెల్లడించారు. తండ్రి ఆరోగ్యమే ఇప్పుడు తమకు మొదటి ప్రాధాన్యత అని, ఆయన కోలుకునే వరకు పెళ్లి గురించి ఎలాంటి నిర్ణయం తీసుకోబోమని తెలిపారు.

స్మృతి మంధానకు తండ్రితో ఉన్న అనుబంధం అందరికీ తెలిసిందే. ఆమె క్రికెట్ కెరీర్‌లో ప్రతి కీలక ఘట్టంలో తండ్రి వెన్నుదన్నుగా నిలిచారు. ఆయన ఆరోగ్య సమస్య కారణంగా తీసుకున్న ఈ నిర్ణయంపై అభిమానులు కూడా సానుభూతి వ్యక్తం చేస్తున్నారు. సోషల్ మీడియాలో మంధాన కుటుంబానికి ధైర్యం చెప్పుతూ, శ్రీనివాస్ త్వరగా కోలుకోవాలని వేలాది మంది ప్రార్థనలు చేస్తున్నారు. ఇక పెళ్లికి కొత్త తేదీ ఎప్పుడని ఎలాంటి ప్రకటన రాలేదు. తండ్రి ఆరోగ్య పరిస్థితి పూర్తిగా మెరుగైన తర్వాతే తదుపరి నిర్ణయం తీసుకోనున్నారని కుటుంబం వర్గాలు తెలిపాయి.

తెలంగాణ ముచ్చట్లు
TELANGANA MUCHATLU
ఎడిటర్ : బొల్లెపాక రాజేష్
తెలుగు దిన పత్రిక

# మీనా పెళ్లిపై పుకార్లకు ఫుల్‌స్టాప్ప్రెండో పెళ్లి లేదంటూ సూటి క్లారిటీ

దక్షిణాది సినిమా రంగంలో అందం, అభినయంతో సంవత్సరాల పాటు ప్రేక్షకుల హృదయాలను గెలుచుకున్న నటి మీనా మరోసారి వార్తల్లో నిలిచింది. ఒకప్పుడు టాప్ హీరోయిన్లలో ఒకరిగా తెలుగు, తమిళం, మలయాళం, కన్నడ భాషల్లో వరుసగా భారీ చిత్రాల్లో నటించిన మీనా, ఇప్పుడు కూడా క్యారెక్టర్ ఓరియెంటెడ్ పాత్రలతో తన సత్తా చాటుతోంది. చిరంజీవి, బాలకృష్ణ, వెంకటేష్, నాగార్జున వంటి మెగాస్టార్లతో స్క్రీన్ షేర్ చేసుకున్న ఈ అందాల తార, పెళ్లి తర్వాత కూడా సినిమాలకు దూరం కాకుండా కెరీర్‌ను కొనసాగిస్తోంది.



అయితే, భర్త మరణం తర్వాత ఆమె వ్యక్తిగత జీవితంపై సోషల్ మీడియాలో ఎక్కడలేని ఊహాగానాలు మొదలయ్యాయి. ముఖ్యంగా మీనా రెండో పెళ్లి చేసుకుంటోందంటూ, ఆమెకు సంబంధం ఉందంటూ అడ్డమీద లేని ప్రచారాలు తెగ హల్‌చల్ చేయసాగాయి. కొంతకాలంగా ఈ రూమర్లు మరింత పెరగడంతో చివరకు మీనా స్వయంగా స్పందించారు. ప్రస్తుతం నేను నా కుమార్తెతో చాలా సంతోషంగా జీవిస్తున్నాను. నా పెళ్లి గురించి వస్తున్న వార్తలన్నీ అవాస్తవాలే. ఏ హీరో విడాకులు తీసుకున్నా, దానికి నన్ను లింక్ చేసి వార్తలు రాయడం చాలా బాధ కలిగిస్తోంది అని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు. తాను ఇప్పుడు పూర్తిగా తన కెరీర్‌పైనే దృష్టి పెట్టానని, ఇలాంటి పుకార్లకు ఇకపై చోటివ్వనని కూడా స్పష్టం చేశారు.

వ్యక్తిగత జీవితంలో ఎన్నో కష్టాలు ఎదురైనా, కెమెరా ముందు మాత్రం చిరునవ్వు కోల్పోకుండా అభిమానులను అలరిస్తున్న మీనా, ప్రస్తుతం పలు భాషల్లో చిత్రాల్లో నటిస్తున్నారు. మలయాళంలో మోహన్‌లాల్‌తో కలిసి రూపొందుతున్న 'దృశ్యం 3' షూటింగ్‌లో పాల్గొంటున్న ఆమె, అదే సమయంలో తమిళంలో 'మూకుత్తి అమ్మన్ 2', 'రౌడీ బేబి' వంటి సినిమాల్లో కీలక పాత్రలు పోషిస్తున్నారు. తెలుగు ప్రేక్షకులకు కూడా ఆమె సుపరిచితమే. 'దృశ్యం' తెలుగు వెర్షన్‌లో నటించిన ఆమె, 'దృశ్యం 3' తెలుగు వెర్షన్‌లో కూడా కనిపించే అవకాశాలు ఉన్నట్లు తెలుస్తోంది.

పాత్రల ఎంపిక విషయంలో కూడా మీనా ఇప్పుడు చాలా జాగ్రత్తలు తీసుకుంటున్నారు. పాప పుట్టిన రెండేళ్లకే 'దృశ్యం' కోసం అడిగారని, కానీ అప్పట్లో చేయలేకపోయానని చెప్పిన ఆమె, తర్వాత కథ నచ్చడంతో ఆ సినిమాకు ఓకే చెప్పానని గుర్తు చేసుకున్నారు. ఇప్పుడు కూడా కేవలం కంటెంట్, పాత్ర సంతృప్తి కలిగిస్తేనే సినిమాలు చేస్తానని, నచ్చని పాత్రలకు నో చెప్పడానికి ఏ మాత్రం వెనకాడను అని ఆమె స్పష్టం చేశారు. ఇక మొత్తానికి, మీనా రెండో పెళ్లి అన్న మాటలకు ఆమె స్పష్టంగా ఫుల్‌స్టాప్ పెట్టడంతో, అభిమానుల్లో కూడా కొంత ఊరట కనిపిస్తోంది. ఉద్యోగ, కుటుంబ జీవితాన్ని సమతూకంగా నిర్వహిస్తూ ముందుకు సాగుతున్న ఈ స్టార్ నటి నిర్ణయాన్ని అభిమానులు గౌరవిస్తున్నట్లు సోషల్ మీడియాలో కామెంట్లు వెల్లువెత్తుతున్నాయి.



# తీవ్ర విషాదంలో ఆదా శర్మ కుటుంబం..

### అమ్మమ్మ తులసి సుందర్‌కు కన్నీటి వీడ్కోలు

'హార్ట్ అటాక్' సినిమాతో తెలుగు సినిమా ప్రేక్షకులకు బాగా పరిచయమైన నటి ఆదా శర్మ కుటుంబంలో తీవ్ర విషాదం చోటు చేసుకుంది. ఆమె అమ్మమ్మ తులసి సుందర్ అనారోగ్యంతో గత నెల రోజులుగా ఆస్పత్రిలో చికిత్స పొందుతూ ఆదివారం తెల్లవారుజామున తుదిశ్వాస విడిచారు. ఆదివారం ఉదయం ఆమె ఆరోగ్య పరిస్థితి ఒక్కసారిగా విషమించడంతో వైద్యులు ఎంత ప్రయత్నించినా ఆమెను కాపాడలేకపోయారు. ఈ వార్తతో ఆదా శర్మ కుటుంబం శోకసంద్రంలో మునిగిపోయింది. ఈ ఏడాది ప్రారంభంలో ఆమె అమ్మమ్మ పుట్టినరోజును ఎంతో సంతోషంగా జరుపుకున్న ఆదా, ఇద్దరూ కలిసి గడిపిన క్షణాలను సోషల్ మీడియాలో వీడియోగా షేర్ చేసి అభిమానులను సైతం ఎమోషనల్ చేసింది. కానీ కొద్ది నెలలకే ఇంత ఘోరమైన విషాదం చోటు చేసుకోవడంతో ఆమె తీవ్ర మనోవేదనలో ఉన్నట్లు తెలుస్తోంది.

తులసి సుందర్ మృతికి సినీ, టీవీ, వెబ్ రంగాలకు చెందిన పలువురు ప్రముఖులు, అలాగే అభిమానులు సోషల్ మీడియాలో సంతాప సందేశాలు తెలియజేస్తున్నారు. చాలామంది "ఆమె ఆత్మకు శాంతి చేకూరాలి" అంటూ ఆదా శర్మకు ధైర్యం చెప్పే ప్రయత్నం చేస్తున్నారు.

# ఇండియన్ యానిమేషన్‌కు ఆస్కార్ దాకా ప్రయాణం..

### మహావతార్ నరసింహా సరికొత్త చరిత్ర



యానిమేషన్ రంగంలో భారత దేశానికి గర్వకారణంగా మారుతున్న 'మహావతార్ నరసింహా' సినిమా ఇప్పుడు అంతర్జాతీయ వేదికపై కూడా సంచలనం సృష్టిస్తోంది. మహావిష్ణువు అవతారమైన నరసింహుని కథను ఆధారంగా చేసుకుని దర్శకుడు అశ్విన్ కుమార్ ఈ చిత్రాన్ని అద్భుతంగా తెరకెక్కించారు. పౌరాణికతకు ఆధునిక యానిమేషన్ టెక్నాలజీని మేళవించి రూపొందించిన ఈ సినిమా విడుదలైన నాటి నుంచి ప్రేక్షకుల నుంచి విశేష స్పందన సంపాదించింది.

కేవలం ముప్పై కోట్ల రూపాయల బడ్జెట్‌తో నిర్మించిన ఈ చిత్రం పాజిటివ్ మౌత్ టాక్‌తో మూడు వందల కోట్లకుపైగా వసూళ్లు రాబట్టి ఇండియన్ యానిమేషన్ సినిమాల స్థాయిని మరో మెట్టు పైకి తీసుకెళ్లింది. ముఖ్యంగా నరసింహుడి ఉగ్రరూపాన్ని చూపించిన విధానం, అతని ఎలివేషన్ సన్నివేశాలకు ఇచ్చిన బ్యాక్‌గ్రౌండ్ స్కోర్ ప్రేక్షకుల్లో గూస్‌బంప్స్ తెప్పించేలా ఉందని సామాజిక మాధ్యమాల్లో ప్రశంసలు వెల్లువెత్తాయి. చిన్నపిల్లల నుంచి పెద్దల వరకు అన్ని వయసుల ప్రేక్షకులను ఆకట్టుకున్న ఈ సినిమా మైథలాజికల్ యానిమేషన్‌కు కొత్త బాటలు వేసింది.

ఇప్పటికే దేశీయంగా భారీ విజయాన్ని అందుకున్న ఈ సినిమా తాజాగా ఆస్కార్ రేస్‌లోకి అడుగుపెట్టడం మరో చారిత్రక ఘట్టంగా మారింది. రాబోయే 98వ అకాడమీ అవార్డ్స్‌లో యానిమేషన్ విభాగానికి 'మహావతార్ నరసింహా' ఎంపికైనట్లు సమాచారం. ఈ విభాగంలో ప్రపంచవ్యాప్తంగా గుర్తింపు పొందిన పలు ప్రముఖ యానిమేషన్ సినిమాలతో పాటు ఈ భారతీయ చిత్రం ఉండటం దేశవ్యాప్తంగా సినిమా ప్రేమికుల్లో ఆనందాన్ని కలిగిస్తోంది. అవార్డు దక్కుతుందా లేదా అన్నది తర్వాతి విషయం అయినప్పటికీ, ఆస్కార్ ఎంపిక దశకు చేరుకోవడమే భారతీయ యానిమేషన్ రంగానికి దక్కిన గొప్ప గౌరవంగా భావిస్తున్నారు.

ఇండస్ట్రీ వర్గాల అభిప్రాయం ప్రకారం ఈ విజయంతో భారత యానిమేషన్ రంగానికి కొత్త ప్రోత్సాహం లభించనుంది. ఇప్పటివరకు ఎక్కువగా విదేశీ యానిమేషన్ సినిమాల ఆధిపత్యం ఉన్న గ్లోబల్ మార్కెట్‌లోకి భారతీయ మైథలాజికల్ యానిమేషన్ కూడా సత్తా చాటగలదని ఈ చిత్రం నిరూపించింది. భవిష్యత్తులో మరిన్ని ఇలాంటి భారీ ప్రాజెక్టులు రావడానికి ఇది మార్గదర్శకంగా నిలుస్తుందని నిపుణులు చెబుతున్నారు. 'మహావతార్ నరసింహా' సాధించిన ఈ గుర్తింపు కేవలం ఒక సినిమాకు పరిమితం కాకుండా, దేశంలోని మొత్తం యానిమేషన్ పరిశ్రమకు గ్లోబల్ స్థాయిలో గుర్తింపును తీసుకువచ్చే మైలురాయిగా మారిందని అభిమానులు అభిప్రాయపడుతున్నారు.

# ఐఎఫ్‌ఎఫ్ఐ వేదికపై సాయిపల్లవి అనుపమ్ ఖేర్ కలయిక

### నెట్టింట వైరల్ అయిన సెల్ఫీ వెనుక విశేషమేంటి?

తెలుగు, తమిళంతో పాటు పాన్ ఇండియా స్థాయిలో తన సహజ నటనతో, నాట్యంతో కోట్లాది అభిమానులను సంపాదించుకున్న సాయిపల్లవి మరోసారి సోషల్ మీడియాలో హాట్ టాపిక్‌గా మారింది. ఈసారి ఆమె నటన కాదు, ఒక సెల్ఫీ. అంతర్జాతీయ ఫిల్మ్ ఫెస్టివల్ ఆఫ్ ఇండియా వేదికగా గోవాలో జరుగుతున్న ఐఎఫ్‌ఎఫ్ఐ వేడుకల సందర్భంగా సాయిపల్లవితో ప్రముఖ బాలీవుడ్ నటుడు, దర్శకుడు అనుపమ్ ఖేర్ ఒక సెల్ఫీ తీసుకున్నారు. ఆ ఫొటోను స్వయంగా అనుపమ్ ఖేర్ తన ఇన్‌స్టాగ్రామ్ ఖాతాలో షేర్ చేయడంతో క్షణాల్లో అది వైరల్ అయింది.

ఆ సెల్ఫీకి ఆకర్షణీయమైన క్యాప్షన్ కూడా జోడించారు అనుపమ్ ఖేర్. ఐఎఫ్‌ఎఫ్ఐలో సాయిపల్లవిని కలవడం ద్వారా చాలా ఆనందం కలిగిందని, చిన్నపాటి సమావేశంలోనే ఆమె ఎంత సహజంగా, ఆప్యాయంగా, మర్యాదగా మాట్లాడిందో తనను బాగా ఆకట్టుకుందన్నారు. ఆమె గొప్ప నటన ప్రతిభ ఉన్న నటి అని, భవిష్యత్తులో ఆమె నుంచి మరిన్ని మంచి సినిమాలు రావాలని శుభాకాంక్షలు కూడా తెలియజేశారు. ఈ మాటలే ఈ సెల్ఫీకి మరింత ప్రత్యేకత తీసుకువచ్చాయి.

సాధారణంగా సినిమాల్లో మాత్రమే తమ అభిమాన హీరోయిన్లను చూసే అభిమానులకు, ఇలా అంతర్జాతీయ వేదికపై సాయిపల్లవి ప్రఖ్యాత బాలీవుడ్ నటుడితో కలిసి కనిపించడం ఒక అరుదైన క్షణంగా మారింది. ముఖ్యంగా సాయిపల్లవి ఎంత సాధారణంగా, ఎలాంటి గ్లామర్ మేకప్ లేకుండా సహజంగా కనిపించిందో చూసి నెటిజన్లు ఆమెను మరింత ప్రశంసిస్తున్నారు. "ఇదే మా సాయి పల్లవి స్టైల్", "నేచురల్ బ్యూటీ" అంటూ కామెంట్లతో సోషల్ మీడియా నిండిపోయింది.

ఇక మరో విశేషం ఏమిటంటే, అనుపమ్ ఖేర్ ప్రస్తుతం ప్రభాస్ హీరోగా తెరకెక్కుతున్న ప్రముఖ తెలుగు సినిమాలో కీలక పాత్రలో నటిస్తున్న సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో తెలుగు సినీ ప్రేక్షకులు... భవిష్యత్తులో సాయిపల్లవి, అనుపమ్ ఖేర్ కలిసి ఏదైనా సినిమాలో నటిస్తే చూడాలని కోరుకుంటూ కామెంట్లు పెడుతున్నారు. ఐఎఫ్‌ఎఫ్ఐ వేదికపై జరిగిన ఈ చిన్నపాటి కలయిక, రెండు ఇండస్ట్రీల మధ్య ఉన్న అనుబంధాన్ని మరోసారి చూపించినట్టుగా మారింది. ఒక సెల్ఫీతోనే ఇంత చర్చ జరగడం సాయిపల్లవి ఉన్న స్థాయికి, ఆమెపై ఉన్న క్రేజ్‌కు నిదర్శనంగా నిలుస్తోంది.



# ఢిల్లీ గాలి విషంగా మారుతోంది..

### కృతి సనన్ హెచ్చరికతో కలవరపడుతున్న అభిమానులు

దేశ రాజధాని ఢిల్లీలో వాయు కాలుష్యం భయంకర స్థాయికి చేరుకుంటోందని బాలీవుడ్ నటి కృతి సనన్ ఆందోళన వ్యక్తం చేశారు. గతంలో ఢిల్లీ ఎలా ఉండేదో తనకు బాగా తెలుసని, కానీ ఇప్పుడు పరిస్థితి మరింత దిగజారిపోయిందని ఆమె పేర్కొన్నారు. తాజాగా తన కొత్త సినిమా 'తేరే ఇష్క్ మే' ప్రీ రిలీజ్ కార్యక్రమంలో పాల్గొన్న సందర్భంగా కృతి ఈ అంశంపై స్పందించారు.


తాను ఢిల్లీ వాసినేనని చెప్పిన కృతి.. ఒకప్పుడు ఇక్కడ శీతాకాలాలు ఎంత ఆహ్లాదంగా ఉండేవో, ఇప్పుడు మాత్రం పొగమంచు, కాలుష్యంతో ఊపిరి తీసుకోవడమే కష్టమవుతోందని చెప్పుకొచ్చారు. ప్రస్తుతం కనిపిస్తున్న పరిస్థితి ఇంకా దారుణంగా మారే ప్రమాదం ఉందని ఆమె హెచ్చరించారు. వెంటనే కఠిన చర్యలు తీసుకోకపోతే రానున్న రోజుల్లో మనం పక్కపక్కనే నిలబడ్డా కూడా ఒకరినొకరు కనిపించని స్థితికి చేరుకుంటామని అన్నారు.



ప్రతి ఏడాది నవంబర్ నుంచే ఢిల్లీలో వాయు కాలుష్యం తీవ్రత పెరుగుతోందని, ఇది ప్రజల ఆరోగ్యాన్ని తీవ్రంగా ప్రభావితం చేస్తోందని ఆమె వ్యాఖ్యానించారు. చిన్నపిల్లలు, వృద్ధులు, ఊపిరితిత్తుల వ్యాధులతో బాధపడేవారు ఎక్కువగా ఇబ్బంది పడుతున్నారని తెలిపారు. తనకు తెలిసిన చాలా మంది శ్వాసకోశ సమస్యలతో బాధపడుతున్నారని, ఇది కేవలం సాధారణ సమస్య కాదు, భవిష్యత్తు తరాలకే ముప్పుగా మారిందని అన్నారు.

తాను నటించిన 'తేరే ఇష్క్ మే' సినిమా ప్రమోషన్లలో భాగంగా దేశవ్యాప్తంగా పర్యటన చేస్తున్న కృతి.. హైదరాబాద్, ముంబై లాంటి నగరాల్లో కూడా కాలుష్యం పెరుగుతున్న తీరును గమనిస్తున్నానని చెప్పింది. కానీ ఢిల్లీలో మాత్రం పరిస్థితి అత్యంత దారుణంగా ఉందని ప్రత్యేకంగా పేర్కొంది. ప్రభుత్వం, ప్రజలు కలిసి పని చేయకపోతే ఈ సమస్యకు పరిష్కారం దొరకదని ఆమె అభిప్రాయపడింది.

కృతి చేసిన వ్యాఖ్యలతో ఢిల్లీ వాయు కాలుష్యం అంశం మరోసారి జాతీయ స్థాయిలో చర్చకు వచ్చింది. సోషల్ మీడియాలో కూడా ఆమె మాటలకు విస్తృతంగా స్పందన వస్తోంది. "ఇది సెలబ్రిటీ మాట మాత్రమే కాదు, ప్రతి పౌరుడి గళం" అంటూ నెటిజెన్లు కామెంట్లు పెడుతున్నారు. ఢిల్లీ వాసులు ఇకనైనా కాలుష్యంపై కఠిన చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని కోరుతున్నారు.



# ఫిట్‌నెస్ ముందు తానే తనతో పోరాటం..

### కీర్తిసురేశ్ ఓపెన్ కామెంట్స్ వైరల్

చెన్నై, నవంబర్ 23, డిజైనర్ టెక్ గురు ప్రతినిధి: సినిమాల్లో గంభీరమైన పాత్రలు, నిజ జీవితంలో సింపుల్ నేచర్.. ఇలా తనకంటూ ప్రత్యేక గుర్తింపు సంపాదించుకున్న కీర్తిసురేశ్ తాజాగా చేసిన వ్యాఖ్యలు నెట్టింట హాట్ టాపిక్‌గా మారాయి. పక్కా ప్రొఫెషనల్‌గా పేరున్న ఈ నటి ఫిట్‌నెస్‌పై ఎంత ఫోకస్ పెడుతుందో తెలిసిందే. అయితే ఆ ఫిట్‌నెస్‌ను కొనసాగించడం తనకు అంత ఈజీ కాదని ఆమె స్వయంగా ఒప్పుకుంది.

ఓ ఇంటర్వ్యూలో మాట్లాడిన కీర్తిసురేశ్.. తాను మంచి ఫుడ్ లవర్‌ని అని, ఇష్టమైన భోజనాన్ని కంట్రోల్ చేసుకోవడమే తనకు అతిపెద్ద ఛాలెంజ్ అని చెప్పింది. తిండిపై ఉన్న ప్రేమను తగ్గించుకోవడం కోసం రోజూ తానే తనతో పోరాడుతుంటానని ఆమె నవ్వుతూ చెప్పుకోవడం ఇప్పుడు వైరల్‌గా మారింది. కఠినమైన డైట్‌ను సరిగ్గా పాటించడం తనకు చాలా కష్టం అని, అయితే ఫిజిక్ మెయింటైన్ చేయాలంటే డిసిప్లిన్ తప్పనిసరి అని ఆమె స్పష్టం చేసింది. అయితే ఏ విషయంలోనూ రాజీ పడని నైజం కీర్తిసురేశ్‌దే. ఫుడ్‌పై లవ్ ఉన్నప్పటికీ, ఫిట్‌నెస్ విషయంలో మాత్రం ఎలాంటి కాంప్రమైజ్ చేయనని, సమయం దొరికినప్పుడల్లా జిమ్, యోగా, వర్కౌట్స్‌కు ప్రాధాన్యం ఇస్తానని చెప్పింది. తన ఈ మాటలు ముఖ్యంగా యువతకు ఇన్‌స్పిరేషన్‌గా మారుతున్నాయి. అందుకే ఆమె అభిమానులు సోషల్ మీడియాలో 'రియల్, రిలేటబుల్ క్వీన్' అంటూ ఆమెను పొగడ్తలతో ముంచెత్తుతున్నారు.

మహానటి చిత్రంతో జాతీయ అవార్డు అందుకున్న తర్వాత కీర్తిసురేశ్‌కు దేశవ్యాప్తంగా ఫ్యాన్ బేస్ మరింత పెరిగింది. ప్రస్తుతం ఆమె తమిళంలో 'రివాల్వర్ రీటా', 'కన్నివేది' వంటి చిత్రాల్లో నటిస్తూ బిజీగా ఉంది. కెరీర్‌తో పాటు ఫిట్‌నెస్‌ను కూడా సమతూకంగా కొనసాగిస్తున్న కీర్తిసురేశ్ చేసిన ఈ నిజాయితీగల వ్యాఖ్యలు ఇప్పుడంతా సోషల్ మీడియాలో చర్చగా మారాయి.